

# నేటి నిజం

website:www.netinijam.com

తెలుగు దినపత్రిక

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ గురువారం 25-6-2020 RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-201 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :26 సంచిక: 284 పేజీలు: 8 వెల: రూ.1/-


# నేటి నుంచి ఆరోవిడత హరితహారం

**నర్సరీల్లో సిద్ధంగా ఉన్న మొక్కలు**

**ఉపాధిహామీతో గుంతలు సిద్ధం చేసిన కూలీలు**

**మెదక్ జిల్లా నర్సాపూర్‌లో ప్రారంభించనున్న సిఎం కెసిఆర్**

**ఇప్పటికే ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి హరీష్ రావు, అధికారులు**

**గ్రామాల్లో సర్పంచ్‌లను సన్నద్ధం చేసిన మంత్రి ఎర్రబెల్లి**

**జిల్లాల్లో పాల్గొననున్న మంత్రులు, ఎమ్మెల్యేలు**

హైదరాబాద్,జైన్24(ఆర్ఎన్ఎ): ఆరో విడత హరితహారం కార్యక్రమానికి తెలంగాణ వ్యాప్తంగా ఏర్పాట్లు చేశారు. పచ్చదనమే లక్ష్యంగా గత ఆరేళ్లుగా చేపడుతున్న కార్యక్రమంతో ఊరూవాడా మొక్కలు నాటుతున్నారు. సర్పంచ్‌లకు గ్రామాల బాధ్యతను అప్పగించారు. ఊరికో నర్సరీని ఏర్పాటు చేసి పెద్ద ఎత్తున మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకున్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని అడవులను 33 శాతానికి పెంచాలనే లక్ష్యంతో హరితహారం కార్యక్రమాన్ని అమలు చేస్తున్నది. ఇందులో భాగంగా ఏటా వానకాలం ప్రారంభంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపడుతున్నది. ఆరోవిడత కార్యక్రమాన్ని సీఎం కేసీఆర్ గురువారం మెదక్ జిల్లా నర్సాపూర్ అర్బన్ పార్కులో మొక్కలు నాటి, కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ఈ మేరకు సిఎం రాక కారణంగా భారీ ఏర్పాట్లు చేశారు. అలాగే జిల్లాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు మొక్కలు నాటుతారు. తొలకరి వర్షాలు పడడంతో భూమి పదనుతో మొక్కలు నాటేందుకు అనువుగా ఉంది. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆరో విడత హరితహారం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంత్రి హరీష్ ఆన్నారు. జిల్లాతో పాటు రాష్ట్రంలోని అడవులను పునరుద్ధరించాలన్నారు. ఈ కార్యక్రమానికి నర్సాపూర్ ఎకో పార్కు వేదిక కానున్నదని మంత్రి అన్నారు. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు రాష్ట్రంలోని అన్ని జాతీయ, రాష్ట్ర రహదారుల వెంట మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిరంతరంగా కొనసాగిం చాలన్నారు. దీనిలో భాగంగా జాతీయ, రాష్ట్ర రహదారుల వెంట ప్రతి 30కిలో మీటర్లకు ఒక నర్సరీ ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లాకు సీఎం రానున్న నేపథ్యంలో ఒక్కో అధికారికి ఒక్కో బాధ్యతను అప్పగించారు. వారు చేయాల్సిన పనులను మంత్రి వివరించారు. విద్యుత్, వ్యవసాయ, డీపీవో, డీఆర్డీఏ, ఫైర్, రోడ్లు, భవనాల శాఖ అధికారులు తమ సిబ్బందితో అందుబాటులో ఉండాలన్నారు. సీఎం కేసీఆర్ రాకకు అవసరమైన స్వాగత తోరణాలు ఏర్పాటు చేయాలని సూచించా రు. హరితహారం కార్యక్రమానికి మొత్తం రూ.12.3కోట్లు వెచ్చించి, 1752హెక్టార్లలో మొక్కలు నాటనున్నట్లు మంత్రి హరీశ్‌రావు తెలిపారు. ప్రతి గ్రామపంచా యతీలో ట్రీ గార్డులు, వాటికి సపోర్టుగా కర్రలను వాడాలని, పెద్ద మొక్కలను నాటాలని కలెక్టర్ ధర్మారెడ్డి అన్నారు. హరితహారంలో ప్రత్యేక అధికారులు అవసరమైన నివేదికలు సిద్ధం చేసుకొని ఉంచుకోవాలని చెప్పారు. మెదక్ జిల్లాలో ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో అటవీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శోభ, కలెక్టర్ ధర్మారెడ్డి, మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే మదన్‌రెడ్డితో కలిసి మంత్రి హరీశ్‌రావు ఏర్పాట్లను పర్యవేక్షిం చారు. అర్బన్ పార్కులో నూతనంగా నిర్మించిన ప్రధానగేటు, బిడ్జి, ఔషధ మొక్కలు, వాచ్‌టవర్ వంటివి పరిశీలించారు. నర్సాపూర్ అటవీ ప్రాంతంలో తిరిగి, ఎక్కడెక్కడ ఎలాంటి ఏర్పాట్లు చేయాలనే వివరాలు, నాటాల్సిన మొక్కలకు సంబంధించిన వివరాలను అధికారులకు సూచించారు. ఇదిలావుంటే ఆరో విడత హరితహారానికి అన్ని నర్సరీల్లో మొక్కలు సిద్దంద్దంగా ఉన్నాయి. ప్రతి గ్రామపంచాయతీలో 5వేల నుంచి 10వేల మొక్కలను పెంచుతున్నారు. ప్రభుత్వం గడిచిన ఐదు విడతల్లో హరితహారం కింద నాటిన మొక్కలతో మండలంలోని పల్లెలో పచ్చదనం సంతరించుకుంది. ఒక్కో నర్సరీలో 5 వేల మొక్కలను పెంచేందుకు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ ఏడాది ఉపాధిహామీ నర్సరీల్లో 100 శాతం మొక్కలను పెంచేందుకు ఉపాధి పథకం అధికారులు ముందస్తుగా నర్సరీలకు షెడ్‌నెట్లను ఏర్పాటు చేశారు. ఉపాధి పథకం ఉన్నత అధికారులు నర్సరీలను పరిశీలించి మొక్కల పెంపకంపై నర్సరీల నిర్వాహకులకు సూచనలు చేశారు. ఆసక్తి ఉన్న రైతులకు వారి పంట పొలాల వద్ద పెంచుకునేందుకు ఉచితంగా ఉపాధిహామీ పథకం ద్వారా గుంతలు తీయడంతో పాటు మొక్కలను అందించన్నారు. గ్రామాల్లో రోడ్లకు ఇరుపక్కలా, గ్రామపంచాయతీ భవనాల వద్ద, పాఠశాలలు, ప్రభుత్వ దవాఖానలు, ప్రభుత్వ కార్యాలయాలు, తదితర చోట్ల మొక్కలను నాటేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందించారు. ఇప్పటికే జిల్లాల్లో ఐదు విడతలుగా హరితహారం కార్యక్రమంలో నాటిన మొక్కలు వృక్షాలుగా మారి పచ్చదనాన్ని సంతరించు కుంటున్నాయి. ఈ నెల 25నుంచి ఆరో విడత ప్రారంభం కానుండడంతో అధికారులు మొక్కలు నాటేందుకు గుంతలు తీయించి పెట్టారు. ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొనేలా అవగాహన కల్పిస్తున్నారు. ప్రజల భాగస్వామ్యంతో హరితహారం కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామని, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, యువజన, మహిళా సంఘాలు సహకరించాలన్నారు. అన్ని గ్రామాల్లో మొక్కలు నాటేందుకు స్థలాలను గుర్తించి,నర్సరీల్లో మొక్కలు అందుబాటులో ఉంచారు. మరోవైపు గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఇప్పటికే అధికారులతో సమీక్షించి అధికారులకు దిశానిర్దేశం చేశారు.

# తెలంగాణలో ఆగని కరోనా

**పెరుగుతున్న కేసులతో గ్రేటర్‌లో ఆందోళన**

హైదరాబాద్,జూన్24(ఆర్ఎన్ఎ):రాష్ట్రంలో కరోనా మహమ్మారి రోజురోజుకూ విజృంభిస్తోంది. కేసుల సంఖ్య పది వేలకు చేరువైంది. వారం రోజులుగా రికార్డు స్థాయిలో కేసులు నమోదవుతున్నయి. మంగళవారం 879 మందికి వైరస్ పాజిటివ్ వచ్చింది. ఇందులో గ్రేటర్ హైదరాబాద్‌లోనే 652 కేసులు నమోదైనట్లు వైద్యారోగ్య శాఖ ప్రకటించింది. మేడ్చల్ జిల్లాలో మంగళవారం ఒక్కరోజే అత్యధికంగా 112 కేసులు నమోదయ్యాయి. రంగారెడ్డి జిల్లాలో 64, వరంగల్ రూరల్ లో 14, కామారెడ్డిలో 10, వరంగల్ అర్బన్ లో 9, జనగామలో 7, సంగారెడ్డిలో 2, మంచిర్యాలలో 2, మహబూబాబాద్ లో 2, మెదక్ లో ఒకటి, నాగర్ కర్నూల్లో 4 కేసులు నమోదయ్యాయి. వీటితో కలిపి రాష్ట్రంలో కరోనా బాధితుల సంఖ్య 9,553కు పెరిగింది. ఇందులో 4,224 మంది వైరస్ నుంచి కోలుకోగా, 5,109 ఆక్టివ్ కేసులు ఉన్నట్టు పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ ప్రకటించారు. రాష్ట్ర అసెంబ్లీలో పనిచేసే మార్షల్ ఎ. జనార్ధన్ కు కరోనా గా నిర్ధారణ అయ్యింది. దీంతో అప్రమత్తమైన అధికారులు ఆయనతో కాంటాక్ట్ అయిన వారిని గుర్తించే పనిలో పడ్డారు. ఈ నెల 18 నుంచి 20 వరకు ఆయనతోపాటు డ్యూటీలో ఉన్న మార్షల్స్ వివరాలు సేకరించారు. కాగా, కరీంనగర్ జిల్లా ఇల్లంతకుంట మండలం మల్యాలలో ఒకే కుటుంబంలో ముగ్గురికి వైరస్ పాజిటివ్ గా తేలింది. నాగర్ కర్నూల్ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేస్తున్న స్టాఫ్ నర్స్, వార్డు బాయ్ కి కరోనా పాజిటివ్ నిర్ధారణ అయ్యింది. దీంతో హాస్పిటల్ సిబ్బంది భయాందోళనకు గురవుతున్నారు. కరోనాతో మంగళవారం మరో ముగ్గురు చనిపోయారని వైద్యారోగ్యశాఖ ప్రకటించింది. దీంతో మరణాల సంఖ్య 220కి పెరిగింది. మృతుల వివరాలను ప్రభుత్వం వెల్లడించ లేదు. రాష్ట్రంలో టెస్ట్ చేపించుకుంటున్న ప్రతి నలుగురిలో ఒకరికి కరోనా పాజిటివ్ వస్తోంది. రాష్ట్రంలో మొత్తం టెస్టుల సంఖ్య 63,249 కు చేరింది.

# అన్ని దేశాల్లోనూ పెరుగుతున్న కేసుల సంఖ్య

**తీవ్రస్థాయికి చేరిన కరోనా వ్యాప్తి**

**అగ్రరాజ్యం అమెరికాలో ఆగని కరోనా విలయం**

న్యూఢిల్లీ,జూన్24(ఆర్ఎన్ఎ): ప్రపంచవ్యాప్తంగా కరోనా కల్లోలం కొనసాగుతోంది. వైరస్ బాధితుల సంఖ్య 93 లక్షలు దాటిందంటే.. పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. అటు మరణాల సంఖ్య కూడా పెరుగుతూ పోతోంది. ప్రజల ఆరోగ్యంపైనే కాకుండా ఆర్థికంగా ఎంతో ప్రభావం చూపిస్తోంది. బ్రెజిల్‌లో పరిస్థితి దారుణంగా మారింది. ప్రపంచవ్యాప్తంగా ఇప్పటి వరకు 93,54,861 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. 4,79,878 మంది మృతి చెందగా.. కరోనా బారినపడి చికిత్స పొంది 50,46,241 మంది కోలుకున్నారు. ఇక అగ్రరాజ్యం అమెరికాలో కరోనా విలయం కొనసాగుతూనే ఉంది. న్యూజెర్సీ, న్యూయార్క్‌పై కరోనా ప్రభావం తీవ్రంగా ఉంది. అమెరికాలో ఇప్పటి వరకు 24,24,168 పాజిటీవ్ కేసులు నమోద య్యాయి. 1,23,473 మంది మృతి చెం దగా.. కరోనా బారిన పడి 10,20,381 మంది కోలుకున్నారు.ప్రపంచంలో రెండు వారాల క్రితం దాకా కొన్ని దేశాల పరిస్థితి మెరుగ్గానే ఉండేది. కానీ, సీన్ రివర్స్ అయింది. కేసుల విషయంలో ఎక్కడో చాలా దూరంలో ఉన్న దేశాలూ ఇప్పుడు టాప్20లోకి వచ్చేశాయి. పెరూ, చిలీ వంటి దేశాలైతే టాప్10లోకి వచ్చాయి. మన పొరుగు దేశాలైన పాకిస్తాన్, బంగ్లాదేశ్ టాప్20లో ఉన్నాయి. కొద్దిరోజుల క్రితం వరకు ఆఫ్రికాలో పరిస్థితి బెటర్ అని అనుకున్నా, ఇప్పుడు సౌతాఫ్రికాలోనూ కేసులు పెరగడం కలవరపెడుతోంది. మొత్తంగా ప్రపంచంలోని 19 దేశాల్లో లక్షకు పైగా కేసులు నమోద య్యాయి. మొత్తంగా ప్ర పంచంలో 92 లక్షల 68 వేల 698 మంది కరోనా బారిన పడగా, 4 లక్షల 76 వేల 373 మంది చనిపోయారు. రికవరీలు ఐదు మిలియన్లకు అంటే 50 లక్షలకు దగ్గర్లో ఉన్నాయి. మొత్తంగా ఇప్పటిదాకా 49 లక్షల 92 వేల 150 మంది ఆస్పత్రుల నుంచి కోలుకున్నా రు. 28 రోజులుగా రోజూ లక్షకు పైనే కేసులు నమోదవుతున్నాయి. ఇప్పటి దాకా జూన్ 19న అత్యధికంగా లక్షా 82 వేల 202 కేసులు రిపోర్ట్ అయ్యాయి. కరోనా మొదలైనప్పటి నుంచి ఇప్పటిదాకా ఒక్కరోజులో నమోదైన కేసుల్లో అదే రికార్డ్. దాదాపు 24.01 లక్షల కేసులు, లక్షా 23 వేలకుపైగా మరణాలతో అమెరికా మొదటి స్థానంలో ఉంది. మొన్నటి దాకా రోల్ మోడల్ అనుకున్న దేశాల్లోనూ ఇప్పుడు కరోనా మళ్లీ విజృంభిస్తోంది. సౌత్ కొరియాలో సెకండ్ వేవ్ మొదలైంది. ఈ విషయాన్నిఆ దేశం అధికారికంగా ప్రకటించింది. ప్రస్తుతం అక్కడ 12,484 మంది కరోనా బారిన పడ్డారు. 281 మంది చనిపోయారు. కేసులు తక్కువగానే ఉన్నా ఆ దేశం చాలా కఠినంగా వ్యవహరిస్తోంది.

# మొక్కలతోనే జీవకోటికి ప్రాణవాయువు : మంత్రి సబితా ఇంద్రారెడ్డి



వికారాబాద్ , జూన్ 24: మొక్కలు నాటడంతోనే జీవకోటికి కావాల్సినంత ప్రాణవాయువు అందుతుందని విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి అన్నారు. పెద్దేముల్ మండలం దుగ్గాపూర్ గ్రామ శివారులోని ప్రభుత్వ అటవీ భూమిలో అటవీశాఖ వారి ఆధ్వర్యంలో ఆరో విడత హరితహారంలో భాగంగా.. స్థానిక ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి, అటవీశాఖ అధికారులతో కలిసి మొక్కలు నాటారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వృక్ష, జంతుజాలానికి కావాల్సిన ప్రాణవాయువు మొక్కల నుండే లభ్యమవుతుందన్నారు. ప్రతి ఒక్కరు విధిగా కనీసం ఐదు మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. ప్రభుత్వం అడవుల శాతం పెంచాలనే ఉద్దేశంతో ఇప్పటి వరకు ప్రతి సంవత్సరం తెలంగాణకు హరితహారం పేరుతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఉద్యమంలా చేపడుతుంద న్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి ఒక్కరు హరితహారం కార్యక్రమంలో భాగస్వాములై విజయవంతం చేయాలని మంత్రి కోరారు.

# నేపాల్ భూభాగాలను ఆక్రమించిన చైనా

**డ్రాగన్ తీరుతో సంకటంలో నేపాల్ ప్రభుత్వం**

న్యూఢిల్లీ, జూన్24(ఆర్ఎన్ఎ): నేపాల్‌లో సుమారు పది ప్రాంతాలను చైనా ఆక్రమించినట్లు తెలుస్తోంది.

దీనికి సంబంధించిన కథనాన్ని ఓ న్యూస్ ఏజెన్సీ రాసింది. టిబెట్‌లో రోడ్డు నిర్మిస్తున్న చైనా.. నేపాల్ భూభాగాన్ని కూడా వాడుకుంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. నేపాల్‌కు చెందిన ఓలే ప్రభుత్వం తాజాగా దీనిపై ఓ నివేదికను విడుదల చేసింది. నేపాల్ వ్యవసాయశాఖకు చెందిన సర్వే డిపార్ట్‌మెంట్ ఈ నివేదిక తయారు చేసింది. నేపాల్‌కు చెందిన సుమారు 33 హెక్టార్ల నేలను చైనా ఆక్రమించినట్లు ఆరోపణలు ఉన్నాయి. సహజ సరిహద్దులుగా ఉన్న నదులను మళ్లించి.. చైనా ఈ ఎత్తుగడలు వేస్తున్నట్లు నేపాల్ ప్రభుత్వం తన నివేదికలో పేర్కొన్నది. టిబెట్ అటానమస్ రీజియన్ ప్రాంతంలో సుమారు పది చోట్ల చైనా ప్రభుత్వం రోడ్డు విస్తరణ పనులను చేపడుతున్నది. దీని వల్ల నదులు, వాటి ఉపనదులు ప్రవాహాన్ని మార్చుకుని నేపాల్ వైపు వస్తున్నాయని, ఒకవేళ ఇదే ప్రక్రియ కొనసాగితే అప్పుడు టీఏఆర్ ప్రాజెక్టు కోసం నేపాల్ చాలా వరకు తన భూభాగాన్ని కోల్పోవలసి వస్తుందని ప్రభుత్వ నివేదికలో తెలిపారు. హుమ్లా జిల్లాలోని బగ్దరే ఖోలా నది, కర్నాలి నది ప్రవాహాలను మార్చి .. ఆ ప్రాంతాల్లో దాదాపు పది హెక్టార్ల నేలను చైనా ఆక్రమించినట్లు ఆరోపణలు ఉన్నాయి.రసువా జిల్లాలో కూడా ఆరు హెక్టార్ల స్థలాన్ని నేపాల్ కోల్పోయింది.

# కరోనాను ఎదుర్కోవడంలో ఆదర్శంగా కేరళ

**అభినందించిన ఐక్యరాజ్య సమితి**

తిరువనంతపురం,జూన్24(ఆర్ఎన్ఎ): దేశవ్యాప్తంగా కరోనా మహమ్మారి విజృంభిస్తున్న నేపథ్యంలో... కరోనాను సమర్థవంతంగా ఎదుర్కొని దేశానికి ఆదర్శప్రాయంగా నిలిచిన కేరళను ఐక్యరాజ్యసమితి కొనియాడింది. రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి కేకే శైలజతో పాటు ఇతర నాయకుల సేవలను, కృషిని ఐరాస ప్రశంసించింది. మంగళవారం 'పబ్లిక్ సర్వీస్ డే'ను పురస్కరించుకుని కరోనాను ఎదుర్కోవటంతో ప్రపంచ వ్యాప్తంగా విశేష కృషి చేసిన వారిని ఐక్యరాజ్య సమితి అభినందించింది. ఆన్‌లైన్ ద్వారా జరిగిన ఈ కార్యక్రమంలో ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరెస్‌తో పాటు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేరళ ఆరోగ్య శాఖ మంత్రి కేకే శైలజ మాట్లాడుతూ... నిఫా వైరస్, 2018-19 లలో వచ్చిన రెండు వరదలను ఎదుర్కోవటంలో రాష్ట్ర ఆరోగ్య శాఖ కీలక పాత్ర పోషించింది. ఆ అనుభవమే కోవిడ్-19 నియంత్రించడంలోనూ ఉపయోగపడింది. వూహాన్‌లో కరోనా కేసులు నమోదైన వెంటనే కేరళ అప్రమత్తం అయింది. తగిన విధంగా చర్యలు తీసుకుంటూ వచ్చింది. రాష్ట్రంలో కరోనా వ్యాప్తి రేటు 12.5, మరణాల రేటు 0.6గా ఉందని మంత్రి శైలజ తెలిపారు.

# పెన్షన్లలో కోతపై హైకోర్టులో కొనసాగిన విచారణ

**జూలై1కి కేసు వాయిదా**

హైదరాబాద్,జూన్24(ఆర్ఎన్ఎ): ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల పింఛన్లలో 25 శాతం ప్రభుత్వం కోత విధించడంపై దాఖలైన పిటీషన్‌ను బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తెలంగాణ హైకోర్టు విచారన చేపట్టింది. పిటిషనర్ తరపు వాదనలు వినిపించిన సీనియర్ కౌన్సిల్ రంగయ్య, చిక్కుడు ప్రభాకర్.. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 3 లక్షల పింఛన్లు తొలగించిన వాటిని వెంటనే విడుదల చేయాలని కోర్టుకు తెలిపారు. పింఛన్లలో కోత విధించే హక్కు రాష్ట్రానికి లేదని పేర్కొన్నారు. పింఛన్లు రాజ్యాంగ హక్కు అని దీనిని కట్ చేయడానికి వీల్లేదని వాదించారు. కాగా పింఛన్లలో కోత విధిస్తూ తెచ్చిన ఆర్డినెన్స్‌ను సవాల్ చేస్తూ పెన్షన్ జేఏసీ పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ప్రభుత్వం జారీ చేసిన జీవోపై ప్రభుత్వ నిర్ణయం తీసుకుని చెపుతామని అడ్వొకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్ హైకోర్టుకు తెలిపారు. జూన్ నుంచి పూర్తిస్థాయిలో పింఛన్లు ఇస్తామని అడ్వొకేట్ జనరల్ వెల్లడించారు. తదుపరి విచారణను హైకోర్టు జులై 1కు వాయిదా వేసింది.

# నగర అభివృద్ధిలో కీలక నిర్ణయాలు

**లాక్‌డౌన్ నేపథ్యంలో రోడ్ల ఆధునీకరన**

**పురపాలక,పట్టణాభివృద్ధి నివేదిక విడుదల చేసిన కెటిఆర్**

హైదరాబాద్,జూన్24(ఆర్ఎన్ఎ): నగర అభివృద్ధిలో అనేక కార్యక్రమాలు చేపట్టామని పురపాలక శాఖ మంత్రి కెటిఆర్ వెల్లడించారు. లాక్‌డౌన్‌ను సద్వినియోగం చేసుకుంటూ నగరంలో రోడ్ల ఆధునీకరణ చేపట్టడం వంటి తదితర అభివృద్ధి చర్యలను పురపాలకశాఖ, పట్టణాభివృద్ధి సంస్థ చేపట్టిందన్నారు. పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ వార్షిక నివేదిక( 2019-20)ను రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి కేటీఆర్ బుధవారం విడుదల చేశారు. హైదరాబాద్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎర్రబెల్లి దయాకర్ రావు, ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అరవింద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. వార్షిక నివేదికలోని ప్రగతికి సంబంధించిన పలు వివరాలు ఈ విధంగా ఉన్నాయి. తెలంగాణ మున్సిపల్ యాక్ట్ 2019 పేరుతో ఈ ఏడాది నూతన మున్సిపల్ చట్టాన్ని తీసుకురావడం. హైదరాబాద్ మినహా రాష్ట్రంలోని 139 పట్టణ స్థానిక సంస్థలకు ఈ చట్టం వర్తింపు. నూతన మున్సిపల్ చట్టం భారతదేశంలోనే ప్రగతిశీల చట్టంగా నిలిచింది. స్వీయ ధృవీకరణతో ఆన్‌లైన్‌లో ఆస్తి పన్ను నమోదు వివరాలు తెలపడం, 240 గజాల స్థలం వరకు ఇంటి నిర్మాణానికి సంబంధించి ఆన్‌లైన్‌లో తక్షణ అనుమతులు పొందడం వంటి వి ఇందులో ప్రధానంగా పేర్కొన్నారు. హైదరాబాద్ 69 కిలోమీటర్ల మేర మెట్రో రైలు సర్వీసులను అందుబాటులోకి తేవడం. ఢిల్లీ తర్వాత హైదరాబాద్ నగరమే అతి పెద్ద మెట్రో రైలు కనెక్టివిటీని కలిగిఉంది. హైదరాబాద్ ప్రజల అవసరార్థం 20 టీఎంసీల సామర్థ్యంతో కేశవాపూర్ రిజర్వాయర్ నిర్మాణం. 123 బస్తీ దవాఖానాల ఏర్పాటు. వీటితో పాటు మరో 45 బస్తీ దవాఖానాలను ప్రారంభించారు. 2020-21 ఏడాదిలో నగరంలో మొత్తం 350 బస్తీ దవాఖానాల ఏర్పాటు లక్ష్యం. నగరంలోని ఆరు జోన్లలో 500 పబ్లిక్ టాయిలెట్ల చొప్పున మొత్తం 3 వేల టాయిలెట్ల ఏర్పాటు చేశామని తెలిపారు. హోర్డింగ్ ఫ్రీ నగరంగా హైదరాబాద్‌ను మార్చడం. ఇందుకోసం బస్ షెల్టర్లను, పబ్లిక్ టాయిలెట్లను వినియోగించడం. కేబుల్ బ్రిడ్జి నిర్మాణం, ఎంజే మార్కెట్ ఆధునీకరణ, యుద్ధప్రాతిపదికన ÷÷-ల ఓవర్ల నిర్మాణం, మెట్రో ప్రతిపాదిత మూడు మార్గాల్లో రవాణా సదుపాయాలను అందుబాటులోకి తేవడం వంటి ఇతర చర్యలను చేపట్టనున్నారు.

## చరిత్రలో నేటినిజం



కేం॥ శారదకు - తెలుగు చిత్రవి
శారదకు - ముదంబు గూర్చు చతురానటనా
నీరదకు - నవరసమ్ముల
వారధికి - నటేశు దాసుడు వరశత చయమున్!!

(జూన్ 25 శారద జననం..)



-రాధశ్రీ

సెల్: 9494481210

# నేటి హరితహారం కోసం సర్వం సిద్ధం: మేయర్

హైదరాబాద్,జూన్24(ఆర్ఎన్ఎ): జీహెచ్ఎంసీ పరిధిలో గురువారం చేపట్టే ఆరవ విడత హరితహారం కార్యక్రమానికి అంతా సిద్ధంగా ఉన్నట్లు నగర మేయర్ బొంతు రామ్మోహన్ తెలిపారు. ఎంపీ, ఎమ్మెల్యే కాలనీలోని విజయ నర్సరీని మేయర్ సందర్శించారు.

ఇటువంటి 29 నర్సరీలు 50 లక్షల మొక్కలతో సిద్ధంగా ఉన్నట్లు మేయర్ వెల్లడించారు. కెటిఆర్ అమీర్‌పేటలో మొక్కలు నాటుతారని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... హరితహారం కార్యక్రమంలో ప్రజలు విరివిగా పాల్గొని మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు.

ప్రతి వార్డులో ప్రజలందరికీ అందుబాటులో ఉండేలా మొక్కలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. హెచ్ఎండీఏ, ఇతర ప్రైవేట్ నర్సరీల నుంచి జీహెచ్ఎంసీ మొక్కలు కొనుగోలు చేస్తోందన్నారు. హైదరాబాద్‌లో గ్రీనరీ పెంపొందించాలన్న సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు అధికారులు, ప్రజాప్రతినిధులు అందరూ కలిసి పని చేస్తున్నట్లు పేర్కొన్నారు.

# రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో కరోనా

పెద్దపల్లి, జూన్ 24 (ఆర్ఎన్ఎ): రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో కరోనా విజృంభించింది. ఒకే రోజు ఎనిమిది మందికి పాజిటివ్ నిర్ధారణ అయింది. ప్రభుత్వ ఆసుపత్రి సీనియర్ మెడికల్ ఆఫీసర్‌తో పాటు రామగుండానికి చెందిన ఒక వ్యక్తికి కూడా కరోనా సోకింది. సీతానగర్‌లో ఇటీవల మరణించిన వ్యక్తి కుటుంబంలో 8 నెలల పాపతో పాటు ముగ్గురికి పాజిటివ్ నిర్ధారణ అయింది. రాంనగర్‌కు చెందిన సింగరేణి ఎస్అండ్‌వీసీ డ్రైవర్ కుటుంబంలో ముగ్గురికి పాజిటివ్ వచ్చింది. దీంతో స్థానికుల్లో భయాందోళనలు నెలకొన్నాయి. ఇంటి నుంచి బయటకు వచ్చేందుకు జంకిపోతున్నారు.



ప్రసిద్ధ కవి "పాటవెలదుల" సృష్టికర్త

**డా॥ వద్దేపల్లి కృష్ణ**

మరియు

**నేటి నిజం** దిన పత్రిక

సంయుక్త ఆధ్వర్యంలో

## ప్రతినెలా ఉత్తమ "పాట వెలదుల"కు బహుమతులు

ప్రతినెలా ఉత్తమ పాట వెలదుల్ని రచించిన రచయితలకు
**ప్రథమ బహుమతి రూ.1,116/-**
**ద్వితీయ బహుమతి రూ.750/-**
**తృతీయ బహుమతి రూ.500/-**లతో పాటు
**ప్రశంసాపత్రం** అందజేయబడును.

'పాట వెలదుల' లక్షణం: ప్రతిపాదంలో 4 పాదాల్లోనూ 5 సూర్యగణాలు (హంస పంచకం) ఉండాలి.

అంటే "ఆటవెలది"లో 2వ, 4వ పాదంలో పాటించే హంస పంచకాన్ని అన్నిపాదాల్లో పాటించాలి.

5 సూర్యగణాల మాత్రల నిడివి 15 మాత్రలు. మాత్రాగణనం 'పాట' లక్షణం.

హంస పంచకం 'ఆటవెలది'లక్షణం.
ఈ వినూత్న పద్య ప్రయోగానికి "పాటవెలది" అని పేరుపెట్టనైనది.

*'పాట వెలది' పద్య ఉదాహరణకు:*

**"పల్లెలందు వీచు పైరగాలి**
**పట్నమందు లేచు పాడుగాలి**
**ప్రియముగాను మనిషి పీల్చుగాలి**
**కలుషితమ్ము ఆయె కర్మగాలి"**

ఇలా కనీసం **5 పద్యాల్ని** రచించి 'నేటినిజం' పత్రికకు ప్రతినెలా **20వ తేదీలోగా** పంపించాలి. ప్రతినెల నెలాఖరులో ఫలితాల్ని ప్రకటించి రచయితలకు బహుమతుల్ని **'నేటినిజం'** వేదికగా అందజేయడం జరుగుతుంది.

*సందేహాలకు డా॥ వద్దేపల్లి గారిని 9246541699లో సంప్రదించండి.*
రచనలు పంపవలసిన ఈమెయిల్:

**E-mail : netinizam2020@gmail.com**

# ఆంధ్రులు ఉత్తరాంధ్రులు తెలంగాణులు



- బి.ఎస్.రాములు
సామాజిక తత్వవేత్త
చైర్మన్, బీసీ కమిషన్, తెలంగాణ రాష్ట్రం
సెల్: 8331966987

" మీకు చెన్నై ఉంది చెన్నయిలో 40 శాతం మీరే.
బెంగుళూరుంది. బెంగుళూరులో 40 శాతం మీరే.
హైదరాబాద్ లో కూడా మీరే.
రైలెక్కితే కలత్తామీదే భువనేశ్వర్ మీదే
ముంబై మీదే ఆంధ్రులు
అదృష్ట వంతులు
హైదరాబాద్ లో కూడా మీరే.
రైలెక్కితే కలత్తామీదే భువనేశ్వర్ మీదే
ముంబై మీదే
మాకేముంది ఒక్కటే..
మా హైదరాబాద్ . ! ఈ పొత్తుల హైదరాబాద్ ఎన్నడు మాది కాలే.
మేం బొంబాయికి వలసపోయినం . మీరు హైదరాబాద్ కు వలస వచ్చిన్రు . మేం గల్ఫ్ కు వలస పోయినం".

ఇది తెలంగాణ ఉద్యమ. కాలంలో
ఓ సాహిత్య మిత్రునితో
19 ఏండ్ల కింద అనంతపురంలో జరిగిన చర్చ? ఇపుడు వాళ్లకు మరో రాజధాని వచ్చింది. అదృష్టమంటే ఆంధ్రులదే. మన హైదరాబాద్ఇప్పటికీ పొత్తులనే ఉండె.

జూబిలీ హిల్స్ బంజారా హిల్స్ , కూకట్ పల్లి మియాపూర్ మాదాపూర్.
కొండాపూర్
హైటెక్ సిటీ
గచ్చి బౌలి
వనస్థలిపురం వాల్లే !
మనోళ్లంత
గుట్టల పాలు ..
అడ్డగుట్ట , జగద్గిరి గుట్ట పార్సీగుట్టల పాలు.
బొగ్గుబాయి బొంబాయి ..
దుబాయి. .పాలు.

ఎంతైనా అదృష్టమంటే ఆంధ్రులదే అన్ని అన్నపుడు కొందరు

మిత్రులు మేం ఆ లెక్కలో లేము . కోస్తాంధ్రులు ఉత్తరాంధ్రకు వలస వచ్చి అభివృద్దిని ఆక్రమించారు. రాజకీయాధిపత్యం వారిదే . సర్దార్ గౌతు లచ్చన్న , ద్రోణంరాజు, కె. యస్. చలం ఇందుకు వ్యతిరేకంగా ఉద్యమించారని అన్నారు. నిజమే. కోస్తాంధ్ర వాళ్లు ఉత్తరాంధ్రను ఎలా కబ్జా చేస్తూ విస్తరించి

క్రమంగా స్థానిక రైతుల్ని కూలీలుగ మార్చి ఆ ఊరి

సర్పంచ్ గా కూడ ఎలా ఎదిగారో గంటేడ గౌరనాయుడు ఒక గొప్ప కథ రాశారు.

ఆ కథ పేరు "తిరుగుడు గుమ్మి". ఇంత గొప్ప కథ తెలంగాణలో దిగబడ్డ

వలసవాదుల ఆధిపత్యం పై కూడ రాలేదు.

ఉత్తరాంధ్ర నుంచి పేరెన్నిక గన్న వారెందరో ఉన్నారు. గురజాడ,, శ్రీశ్రీ , రావిశాస్త్రి , కాళీపట్నం రామారావు, తెన్నేటి విశ్వనాథం, గిడుగు రామ్మూర్తి, పురిపండా అప్పలస్వామి, అబ్బూరి వరద రాజేశ్వర రావు, ఘంటశాల వంటి ఎందరో ప్రసిద్ధులు. వీరంత ఒకే కులానికి చెందినవారు. సర్దార్ గౌతు లచ్చన్న , అల్లూరి సీతారామరాజు వంటి కొందరు మినహాయింపు.

ఇంతమంది తెలివిగల వారుండగా ఉత్తరాంధ్ర ప్రాంతం కోస్తాంధ్ర లోని కమ్మ, రెడ్ల వశమెందుకైంది? రాజుల కులం కూడా ఉండగా ఇలా ఎలా జరిగింది? బ్రాహ్మణ కులం తమ ప్రయోజనాలకు పరిమితమై కోస్తాంధ్ర కమ్మ రెడ్ల తో కలిసి పోయారా ? చెన్నయి లో , సినిమా రంగంలోగాని , పత్రికా రంగంలోగాని, జాతీయోద్యమంలోగాని ఆంధ్ర విశ్వ విద్యాలయం వంటి ఒప్పందాలతో సరి పుచ్చుకున్నారా? అసలు ఉత్తరాంధ్ర సామాజిక

వర్గాల పొందిక ఏమిటి? 1969లో వచ్చిన







శ్రీకాకుళం నక్సలైట్ ఉద్యమం అక్కడి సామాజిక వర్గాల పొందికను తారుమారు చేసి కోస్తా వారి విస్తరణ ను వేగవంతం చేసిందా? ఉత్తరాంధ్ర బహుజన వర్గాలు పొట్ట చేత పట్టుకొని పాలమూరు లేబర్‌లా కలకత్తా , ఖరగ్ పూర్, బాలాసోర్, భువనేశ్వర్, భిలాయ్, రాజ్‌నంద్‌గాం, హైదరాబాద్ , చెన్నయి ప్రాంతాల్లో మట్టి పని, రిక్షాపని, ఇండ్ల నిర్మాణం పనుల్లో కూలీల య్యారు. ఇలా వారి బతుకు తెలంగాణ బహుజనులకన్నా భిన్నంగా ఏమీ సాగలేదు. సర్ ఆర్థర్ కాటన్ కట్టించిన నాటి ప్రాజెక్టుల వల్ల ఎదిగిన కోస్తా కులాలు (కమ్మ, రెడ్డి, కాపు, బ్రాహ్మణ , రాజులు)విస్తరించి, అటు చెన్నయి, ఇటు ఇటు ఉత్తరాంధ్ర, తెలంగాణ దాక విస్తరించారా.?

ఆ పరిణామాలపై వకులాభరణం రామకృష్ణ చేసిన పరిశోధన తేల్చిన విషయం ఇదే అయితే తెలంగాణలో రైతే రాజు అనే అభివృద్ధి పరిణామాలు ఏ ఏ కులాలను విస్తరణ వాదులుగా ముందుకు తెస్తాయి? ఉత్తరాంధ్ర పరిణామాల నుండి, కోస్తాంధ్ర విస్తరణ, వలసవాదుల నుండి నేర్చుకోవాల్సిన పాఠాలేమిటి?

ఉత్తరాంధ్ర బహుజనుల అభివృద్దికి నూతన నమూనాలేమిటి? కోస్తాంధ్ర పెత్తనం ఉత్తరాంధ్రలో ఆంధ్ర విశ్వ విద్యాలయంతోనే, కట్టమంచి రామలింగారెడ్డి వైస్ ఛాన్సలర్ తోనే స్థిర పడిందా?

కేంద్ర ప్రభుత్వ సంస్థలు కోరి కోరి తలకొరివి పెటుకున్నట్టయిందా? 1965 లో విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అని ఉద్యమించి చేతులార మందికి మన ప్రాంతాన్ని అప్పగించామా? హైదరాబాద్ సమైక్య రాజధాని కావడం వల్లనే కదా భూములు, పరిశ్రమలు ఇతరుల పాలయ్యాయి!

ఎక్కడ అభివృద్ధి మొదలవుతుందో అక్కడ వలస వాదులు పరిగెత్తుకొస్తారు. బెల్లం చుట్టు ఈగలు ముసురుతాయి.. ఈ ఈగలు మొత్తం బెల్లాన్ని తినేస్తాయి.







తెలంగాణ వచ్చినాక కూడా మాకు వచ్చిందేమిటి? మాకు ఇచ్చిందేమిటి? సామాజిక వర్గాల పొందికలో ఏదైనా మార్పు వచ్చిందా? అని ప్రశ్నిస్తున్నారు.

జనాభా రీత్యా మార్పు స్పష్టతమైంది. ఎస్టీలు 10 శాతం, ఎస్సీలు 16 శాతం , బీసీలు 52 శాతం, ముస్లింలలోని బీసీలను కలుపుతుంటే బీసీలు 62 శాతం, ఇతరులు 12 శాతం అని, మొత్తం ముస్లింలు 13 శాతం అని తేలింది. కాని అభివృద్దిలో ఈ శాతాల మేరకు ఈ సామాజిక వర్గాల పొందిక ప్రకారం అభివృద్ది అందుకునే మౌలిక అభివృద్ధి నమూనా రూపొందించుకోగలిగామా?

రైతే రాజు పథకం రెండుమూడుకులాలు ఎదగడానికే! బ్యాంకు రుణాల మాఫీ కూడ వారికే. సామాన్యులకు బ్యాంకురుణాలు గగన కుసుమాలు.

80 వేల కోట్ల కాళేశ్వరం, అలాంటి ప్రాజెక్టులన్నీ 30 శాతం గల రైతాంగానికి లబ్దిదారుల చేకూరుతుంది. భూమిలేని వారికి ఇందులో 50 రోజుల కూలి తప్ప మరేమి లేదు రాదు.!

యాంత్రీకరణతో ధనిక రైతులకు లాభం ! బహుజ నులకు నష్టం. 30 శాతం రైతాంగంలో 23 శాతం సన్నకార , మధ్య తరగతి రైతాంగమే. రైతే రాజంటే వారే సర్పంచులుగా, జెడ్పీటీసీలుగా, మండలాధ్య క్షులుగా, జిల్లా పరిషత్ చైర్మన్‌లుగా, ఎమ్మెలుగా, పారిశ్రామికవేత్తలుగా , ప్రయివేటు విద్యా ఉద్యోగ , సినిమా, కాంట్రాక్టు, రియల్ ఎస్టేట్ రంగాల్లో ఎదగడమనే కదా! రైతేరాజు అంటే రెడ్లు అనగా టిఆర్ఎస్ ను అభిమానించడ కొత్తతరం రెడ్లు(మల్లారెడ్డి, పల్లా రాజేశ్వరరెడ్డి, జి. జగదీశ్వర రెడ్డి మొ. ) కొత్తతరం వెలమలు (మై హోం జె రామేశ్వరరావు మొ.) అన్ని రంగాలలో రాజులుగా ఎదగడం.

ఇందులో బహుజనులు ఎదిగే ప్రణాళిక ఉందా? 80 వేల కోట్లు కాళేశ్వరం కు పెట్టి 30 శాతం రైతుల ఆదాయ స్థిరీకరణ, భూముల ధర పెరిగి పరపతి స్థిరీకరణ అదనపు సంపద ఉత్పత్తి ( నిజామాబాద్ అంకాపూర్ లోవలె అభివృద్ధి) సాగుతుంది. ఇలా వ్యవసాయం గల కులాలైన రెడ్లు వెలమలు, బ్రాహ్మణ కులాలు , వారితో పాటు మున్నూరు కాపులు వంటి ఒకటి రెండు కులాలు బలపడుతాయి. (బిజెపి తరఫున మున్నూరుకాపులు యంపీలుగా గెలవడం ఈ పరిణామాలకు సూచిక )ఈ అభివృద్దిలో బహుజనుల ఎదుగుదలకు స్థానంలేదు.

కాళేశ్వరం కోసం 30 శాతం రైతాంగం కోసం 80 వేల కోట్లు ఖర్చు చేసినపుడు వారు కాకుండా మిగతా బహుజన వర్గాలు 60 శాతానికి రెట్టింపు పెట్టుబడి పెడితే , నూతన నైపుణ్యాలతో

**ఉత్తరాంధ్రలో రాజధానికి ప్రజలకు శాపం అవుతుందా ! హైదరాబాద్ ను ఆక్రమించినట్టు ఆక్రమించే కులాల పాలవుతుందా!**

నూతన అవసరాల ఉత్పత్తులు చేస్తే ఆ పెట్టుబడితో మూడునాలుగు రెట్ల సంపద ఉత్పత్తి అవుతుంది. చైనా నుంచి ఇతర దేశాల నుంచి దిగుమతుల అవసరం తీరి పోతుంది. లక్షల కోట్ల విదేశీ మారక ద్రవ్యం మిగులుతుంది. లక్షలాది మంది నూతన ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. బొంబాయి దుబాయి తదితర వలసలు ఆగి పోతాయి.

జనాభాకు అనుగుణంగా ప్రణాళికలు. సింగపూర్ అభివృద్ధి నమూనా లో వ్యవసాయం పాత్ర లేకుండానే సాధ్య పడింది. ప్రపంచీకరణలో సాఫ్టువేర్ రంగంలో సకాలం అవకాశాలు గమనించడం వల్ల లక్షలాది మందికి , దేశానికి ఆధారమైంది. బహుజనుల

మేధస్సుతో మేధోమదనం చేసి వుంటే ప్రపంచ మార్కెట్లో చైనా 60 మనది 40 శాతం గా ప్రపంచాన్ని ఊపేసిఉండేది. ఇప్పటికైన ఎప్పటికైన అంతర్జాతీయ విపణిలో చలన శీలత గల బహుజన నైపుణ్యాలదే ప్రధాన పాత్ర. మానవ నరుల పట్ల ఈ దృష్టి శ్రద్ధ లేని ఏ దేశమైన ఏ పాలకులైన పారిశ్రామిక వేత్తలైనా సామంత రాజులుగా, దళారీ ఏజెంట్లుగనే కొనసాగుతారు. చైనాకు జనమే సంపద. మనకు కూడా జనమే సంపద ... అనే శ్రద్ధ పెరిగితే కాళేశ్వరం ప్రాజెక్టుకు పెట్టిన దానికి రెండురెట్లు బహుజన మానవ వనరుల నైపుణ్యాల ఉత్పత్తుల అభివృద్ధి కి బడ్జెట్ పెట్టుబడి పెడ్తారు. ఈ అవసరాన్ని గుర్తించే సామాజిక వర్గాలు ఈనాటి అవసరం

అందువల్ల ఉత్తరాంధ్రలో రాజధానికి ప్రజలకు శాపం అవుతుందా ! హైదరాబాద్ ను ఆక్రమించినట్టు ఆక్రమించే కులాల పాలవుతుందా! ఆలోచించడం అవసరం..

---

## పిల్లలు విరియాలి



పిల్లలు పిల్లలు పిల్లలు
పిల్లలు విరిసిన పువ్వులు
పిల్లల నవ్వులు మల్లెలు
పిల్లలే రేపటి పౌరులు //పిల్లలు//

మాయ మర్మము ఎరగనివారు
ముద్దుల మాటలు పలికేవారు
మదిలో కల్మషమే లేనివారు
చిన్ని,చిన్ని పాపలు వారు //పిల్లలు//

అమ్మ,నాన్నల ప్రేమకు ప్రతిరూపాలు
అవనిలో పుట్టిన అమాయకపు దివ్వెలు వారు
ఏది మంచో,ఏది చెడో తెలీని చిట్టి బుజ్జాయులు
మంచిని ప్రేమించే పిల్లలు వారు //పిల్లలు//

బడియే గుడియని తలచేవారు
ఆట,పాటలును ఇష్టపడేవారు
ప్రేమగా పలికే మనుష్యులెవరైనా
చెలిమిచేసి జతకట్టేవారు పిల్లలు. //పిల్లలు//

వాన నీటిలో తడిసేవారు
కాగితపు పడవలతో మురిసేవారు
గాలిపటాలను ఎగరేసేవారు
కాకెంగిలి చేసి రుచులను చూసేవారు
క్రబిళ్లాటలతో,క్రికెట్ సైయాటలతో
బాల్యములో చక్రము తిప్పిన
బాలచంద్రులు పిల్లలు //పిల్లలు//

చదువులపేరుతో పిల్లలను
చావకొట్టి చంపొద్దు
ర్యాంకులు రావాలని
గ్రేడులు తెచ్చుకోవాలని
చిరు మనసులను చిదమొద్దు //పిల్లలు//

సున్నిత వారి మనస్సులలో
చదవనే దీపం వెలిగిద్దాం
చదువుల విలువను వారికి తెలిపి
మంచి భవితను వారికి ఇద్దాం

విరిసే పువ్వులవలె,పిల్లలను
వికసింపచేద్దాం
మహనీయుల కధలు వారికి చెప్పి
జాతిరత్నాలుగా తయారుచేసి
భరతజాతికి అంకితమిద్దాం



-విశ్వనాథ నరసింహం
9490971589

## పిల్లలం

పిల్లలం మేం పిడుగులం
ఆడిపాడే బుడుగులం ॥పిల్లలం॥
నింగి నేలకు నిచ్చనలేసి
పైకి, క్రిందికి ఊయ్యాలూగుతం
పరుగుల వరదై ఎక్కి దిగుతూ
జారుడు బండపై పల్టీ కొడుతం ॥పిల్లలం॥
ఊరు వాడ చెక్కర్లేసి
సయ్యాటల దాగుతూ వుంటాం
అడవి జంతువులతో పాటలు పాడి
పండ్లు,ఫలాలతో కడుపు నింపుతాం ॥పిల్లలం॥
క్రమశిక్షణతో బడికి వెళ్ళి
గురువుల చెంతన విద్య నేర్చుతాం
విజయాలెన్నో పొందుతూ సాగి
నవ భారతావనికి వారసులౌతాం
॥పిల్లలం॥



-ఉంద్రాళ్ళ రాజేశం
9966946084

# బాల వికాసం

## బాల గేయం
### అరటి చెట్లు!

పంట చేలలోనే కాదు
ఇంటి పెరటిలో సైతం
అందంగా అనువుగాను
పెంపొందే అరటి చెట్లు
ఒక్క కాతనే కాచే
లెక్కలేని అరటిచెట్లు
ఇంటింటికి అందించును
ఇష్టమైన అరటిపండ్లు!
సత్యదేవు వ్రతాలకూ
అనేక శుభకార్యాలకూ
అలంకారమై నిలుచును
అందరినీ అలరించును
నిత్య భోజనాలకూ
అత్యవసరమైనవి, యీ
అరటి విస్తరాకులే!
ఆరోగ్యపు ఆకులే!



- డా॥ వడ్డేపల్లి కృష్ణ
9246541699

## సమిదౌతున్న..బాల్యం

సరదాగా ఆట పాటలతో
జీవితాన్ని గడపాల్సిన బాలలు
బాల్య వివాహాల రూపంలో
బలై పోతూనే ఉన్నారు !
లేత ప్రాయంలోనే పెళ్లిళ్లు చేసి
చేతులు దులుపుకుంటున్న
తల్లిదండ్రులు ..చిన్నారుల
జీవితాన్ని చెదలు పట్టిస్తున్నారు !
అత్తవారింట్లో అడుగుపెట్టిన
అమాయకపు అమ్మాయిలు
ప్రమాదాలు ఏ వైపు నుంచి
ఎప్పుడు ముంచుకొస్తాయోనని
బిక్కుబిక్కుమంటూ భయంతో
ఆగమై పోతూనే ఉన్నారు !
నరసర్పాల పడగ నీడలో
భావి పౌరుల బాల్యమంతా
విషపు కాటుకు బలైపోతుంటే
టీవీల్లో పేపర్లో సోషల్ మీడియాలో
సొల్లు కబుర్లతో పబ్బం గడుపుతున్న
సోయిలేని నాయకులు,అధికారులు
బంధీఐన బాల్యాన్ని రక్షించలేరా ?
ఇంకెన్నాళ్లీ..మూఢాచారాలు ?
ఇంకెన్నాళ్లీ .. ఘోరాలు ??

-సునీత బండారు
9440671530

## గాంధీ మొగ్గలు

పుతిలీబాయి కడుపులో పురుడోసుకుని
మోహన్ దాస్ కరంచంద్ గా పరిమళించాడు
తల్లిమాట జవదాటని పుత్రుడు గాంధీజీ

పోరుబందరులో మొదలైన జీవితం
స్వేచ్ఛాభారతానికై పోరు నేర్పిన ధీరుడు
స్వాతంత్ర్యమే స్వేచ్ఛహక్కని నినదించాడు గాంధీజీ

భగవద్గీత పఠనంతో ఆత్మజ్ఞానం పొంది
మతమేదైనా భోదించే సారమొక్కటేనన్నాడు
విశ్వమతసారాన్ని గ్రహించిన విశ్వనాయకుడు గాంధీజీ

ఉద్యమమేదైనా ఉత్సాహమే నాయకత్వమై
అహింస సిద్ధాంతమే ఆయనకాయుధమైంది
జగనికే మార్గం చూపినాడు మహాత్ముడు

భారతీయులకంత ఆయన మాటే శాసనమై
అఖండభారతావనిని ఏకతాటిపైకి తెచ్చాడు
స్వాతంత్ర్యాన్ని సార్థకంచేసిన సాధుజీవి గాంధీజీ

-సి. శేఖర్
9010480557

## బడిని అలా చూసినప్పుడు...

నక్షత్రాలను విత్తుకుని
వెలుతురు వనాలను పెంచుకునే చోట
అక్షరాల పూలతోటల్లో
బాల్యం సీతాకోకచిలుకలుగా నవ్వే చోట
అల్లరి అల్లరిగా ఎగిరే
రంగు రంగుల తేనె రెక్కల తూనీగల్ని చూస్తూ
ఆనందాల హరివిల్లులమీద ఊరేగాల్సిన చోట

ఒక ఆరంభ సంబరానికై
నిరీక్షించీ నిరీక్షించీ
అలసిపోయిన ఆవరణ
పాలపిట్టల సమూహాల పాటలకై
ఎదురుచూసీ ఎదురుచూసీ
రాలిపడిన ఆకుల కుప్పలు
గదుల నాలుగు మూలల్లోనూ
నిశ్శబ్దాల్ని నేస్తున్న సాలీళ్ళు
ఒక్క తెల్లని వానచుక్కాలేక
వెలవెలబోయిన నల్లమేఘాలు
ఒక్క చిట్టి నీటివాగూ పలకరించక
అలిగి బిగదీసుకు కూర్చున్న పూలతీగలూ
అమాయకపు చూపుల చేతులతో
మనసు భుజాల్ని చుట్టేసి
మెత్తని జ్ఞాపకాలుగా ఎగరడానికి
ఒక్క పిచ్చుకా లేని తరగతి గదులు

బడిని అలా చూసినప్పుడు...
స్మశాన గాలులు తాకినట్టు
వెన్నులో ఒక జలదరింపు
ఏ పెనుగాలికో కూలిపోయిన
మహావృక్షమొకటి
నేలపైన సృష్టించిన శూన్యంలా
గుండె గదుల్లో ఒక నిట్టూర్పు
పచ్చని అరణ్యాన్ని కలగంటున్న కళ్ళముందు
అకస్మాత్తుగా ఎడారి ప్రత్యక్షమైన నిశ్చేష్టత
మూడు పాఠాలు ఆరు నవ్వులుగా
విరబూయాల్సిన వసంతంలో
జ్ఞానకోయిలల పాటల్ని మింగేసిన
అంతుపట్టని శిశిరపు మోతలు
లేలేత హృదయాల పల్లకీల్లో
మహారాజుల్లా విహరించాల్సిన చోట
నిశ్శబ్దపల్లకీల్ని మోస్తున్న క్షోభ!



- సాంబమూర్తి లండ.
9642732008

## సచ్ఛీలత దిశగా

బాల్యంలో ప్రతీదీ బాగుందని నమ్మాను
ఎందరో బహుపరాక్ అని వెన్ను తట్టినా
లోకమంతా
అందాల హరివిల్లు అనే భ్రమించాను

రాను రాను చుట్టూ ఉన్న వారి
కుహనా వ్యక్తిత్వాలను చూశాను
చూసి కాచి వడబోశాను
మనసు మండిపోతోంది
ఆత్మీయత ఆవిరైపోతోంది
మంచితనం మాటున దోపిడీలు కాంచాను
చిన్నా పెద్దా ఆరిందాల్లా ఆరాలు తీస్తున్నారు
అర్థంలేని నీతులను వల్లిస్తున్నారు
దగాదర్పంతో కళ్ళుమూసుకుపోతున్నాయి

పెద్దలు కూడా చెడును ఎదిరించలేక
చెడుతో చేతులు కలుపుతున్నారు
తప్పిదాల్ని సమర్థిస్తున్నారు
మంచితనం మరుగునపడింది
కానీ
తలవని తలంపుగా
కొందరు మహోన్నతులు తారసపడ్డారు
వారిలో ముసలీ ముతకా బీదా బిక్కీ ఉన్నారు
వారిని చేరడం దుస్సాధ్యం కాదు
సాటి మనిషిని అర్థం చేసుకుంటారు
బెట్టు చేయక ఆర్తుల్ని ఆదరిస్తారు

సలహాలు, సంప్రదింపులు విరివిగా చేస్తారు
అన్ని విధాలా అండగా నిలుస్తారు
బదులు ఆశించక సమాజంలో నిలుస్తారు
వారిని కనుగొనేందుకు
కాసింత ఇంగితమూ
మరి కాసింత క్రమశిక్షణా చాలు

శాంతి, దయ, క్షమ లాంటి మనోపుష్పాలు
వారిని చూసి నేర్వాలి
వారితో తరచూ మసలుతుంటే
మనలోనూ సచ్ఛీలత అంకురిస్తుంది.



- ఆచార్య సువర్ణ అలివేలు
9100483510



జూన్ 22న జి.వి.ఆర్. ఆరాధన కల్చరల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర సలహాదారు డా॥కె.వి.రమణాచారి క్యాంపు ఆఫీసులో నిర్వహించిన కార్యక్రమంలో గుదిబండి వెంకటరెడ్డి సంపాదకత్వం వహించిన 'వృద్ధాప్యం' కవితా సంకలనాన్ని డా॥కె.వి.రమణాచారి ఆవిష్కరిస్తుంచగా, పొత్తూరి సుబ్బారావు సభకు అధ్యక్షత వహించారు. చిత్రంలో వి.వి.రాఘవరెడ్డి, డా॥రామరాజు శ్రీనివాసరావు, మహ్మద్ రఫీ ఉన్నారు.

## "నాన్న మొగ్గలు" కవితాసంపుటి ఆవిష్కరణ



పాలమూరు జిల్లా ప్రముఖ కవి డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్ రచించిన "నాన్న మొగ్గలు" కవితాసంపుటిని రాష్ట్ర మద్య నిషేధ, పర్యాటక, క్రీడా, సాంస్కృతిక, పురావస్తు శాఖామంత్రి డాక్టర్ వి.శ్రీనివాస్ గౌడ్ ఆవిష్కరించారు.

సోమవారం నాడు మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని రెవెన్యూ సమావేశ మందిరంలో జరిగిన ఒక కార్యక్రమంలో దీనిని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భీంపల్లి వాళ్ళ నాన్నను స్మరిస్తూ స్మృతి నివాళిగా దీనిని రచించారన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎస్. వెంకట్రావు, విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ ఎం.బాలయ్య, ఒకటవ వార్డు కౌన్సిలర్ తిరుమల వెంకటేష్, కవులు బోల యాదయ్య, సృజామి తదితరులు పాల్గొన్నారు.

నేటినిజం

# సాహితీ కెరటాలు

E-mail : netinijam93@gmail.com    website: www.netinijam.com

గురువారం 25-6-2020    ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433    హైదరాబాద్ 3

## నమ్మలేని నిజాలు

విద్యావ్యవస్థ
కరోన కట్టడిలో
ఎప్పుడూ ముక్తి

పాముల పబ్బం
సంరక్షణ సంస్థలు
ప్రజల్లో భాగం

వనచరాలు
జన భోజనానికి
విహార యాత్ర

జూడాల సమ్మె
దేవుళ్లంటు దాడులు
రక్షణ కోసం

వర్ష ఋతువు
చినుకుల సంతకం
జీవన గంజి



- రేడియమ్
సెల్: 9291527757

## శ్రీనిజాలు

అయ్యా డాక్టర్ బాబులు
సంఖ్య పెంచండి టెస్టులు !
పాజిటివే వచ్చిందా
తీసుకుంటారు రెస్టులు !

వేలువేలు పెరుగుతుంటె
కరోనా కేసులు !
వందల వందలవుతారు
మృత్యువుకు దాసులు !



- కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

## ఆశ

మంత్రముగ్ధం చేసే
మహోత్కృష్ట సృష్టిలో
నిరాటంకంగా
అప్రతిహతంగా
కడలి తరంగంలా
గలగలలాడుతూ
పరవళ్ళు త్రొక్కే
మానవ జీవితం

నేడు గాలిలో దీపంలా
రెపరెపలాడుతూవుంది.
అనూహ్యంగా
అనివార్యంగా
ప్రకృతిలో ఉద్భవించే
ఏ వినాశకర వైరస్ ముట్టడిలో
అర్ధాంతరంగా ముగిసిపోతుందో
అర్ధంకాని అనిశ్చితి కొనసాగుతోంది.
ఇంత కాలం
స్వేచ్ఛా విహంగంలా
విహరిస్తూ గడిపిన
మధుర క్షణాల్ని
'కరోనా' మహమ్మారి
కావిస్తున్న సంక్షోభంతో

గతకాలపు స్మృతులుగా
స్మరిస్తూ ఉండడం
జీవన శైలి మారుతూ
భౌతిక దూరాలు పెరుగుతూ
సాంఘిక సంబంధాలు బలహీనపడుతూ
ప్రగతి చక్రాలు స్తంభిస్తూ
ఆర్థిక సంక్షోభంతో
కుంగిపోతున్న జీవితాలకు
ఆశావాద దృక్పథమేకదా
చిరజీవన సంజీవని!!!



-డా॥ సమ్మన్న ఈటెల
సెల్: 985238654

## రుబాయిలు

మనిషెక్కడ? మనసెక్కడ? ఆశలెంట పరుగు
విలువలన్ని కోలుపోగ డాలరెంట తిరుగు
బంధమేమి లేనిబతుకు కూడా ఒక బతుకేనా?
మనసులేని మనిషిప్పుడు చీకటింట పురుగు

ఎంత కాలము? ఎంత వేగము? జనమునందు పోటీ
పెరిగిన మనజ్ఞానం పుడమినందేపాటి
కార్యకారణ సంబంధం ఉండకెలా పోతుంది?
ఎత్తుగడల ఆటల్లో పైఎత్తులందు మేటి!

సేవలన్ని కొనుగోలుకు ఎలా దొరుకునండి?
ఆత్మీయత ఏదున్నది? కల్తిపాల సరుకులెండి

ప్రేమలేని సేవలను ఆశించునెవరు సుమా?
సంపదనే హత్తుకునే మనసు కరుకు పొండి!

ఒంటరి పోకడలతో ఎంతని పరుగెడతారు?
అత్యాశల జెండతోనే అందలాన్ని చుడుతారు!
అందివచ్చి నవకాశం బుసకొట్టగ చూడును లే
దారి తప్పినడుగులతో గోతిలోనే పడతారు!

జీవరాశి మనుగడకై మనిషిలోన చింత ఎంత?
అంతరించు ప్రకృతిలో మనవాట ఎంతొ కొంత
ముంచుకొచ్చు ముప్పులతో అన్నీఇక తప్పలే!
పాఠమేదొ నేర్వాల్సిన సమయమెంత వింత?!



- మోతుకరి అశోక్ కుమార్
సెల్:9247380976

## మహమ్మారిని ద్రుంచవలెను

కలియుగంబని కథలు చెప్పిరి
కథలు నిజమని నమ్మకుంటిమి
దోషమేమో తెలియకుంటిమి
ఆపదలు కొని తెచ్చుకొంటిమి.

సూర్యుడింకా వెలుగుచుండెను
చందమామకు దోఖలేదు
వానలింకా కురియుచున్నవి
సృష్టి గమనము నిలిచిపోదు.

కొంత ప్రళయము చేయుమిషలో
వింత జీవికరోన వచ్చెను
లోకమంతా తల్లడిల్లెను
శోకసంద్రము పొంగి పొర్లెను.

ఐననేమీ భారతావని
ఆత్మశక్తే గొప్పదనగా
మోండి, అండగ మనకు నిలిచెను
ముఖ్యమంత్రియు చొరవ జూపెను.

కష్టకాలము వచ్చినందున
గట్టిగానే నిలువవలయును
యోగబలమును పెంచవలయును
మహమ్మారిని ద్రుంచవలయును.



- మసన చెన్నప్ప
సెల్:9885654381

# పురుషాహంకారంపై మందరపు ధిక్కార స్వరం

నిబద్ధురాలైన స్త్రీవాద రచయిత్రిగా పేరుగాంచిన మందరపు హైమవతి రచించిన మూడవ కవితా సంపుటి 'నీలి గోరింట' ఈ సంపుటిలోని 57 కవితలు చదివింతర్వాత ఓ దిగులు ఆవహిస్తుంది. గుండె బరువెక్కుతుంది. సమాజంలో స్త్రీల పరిస్థితి యింత దారుణంగా వుందా అన్న ప్రశ్న వేధిస్తుంది.

**"ఒకే చూరు కింద వున్నా**
**ఎడ మొహంపెడమొహం గీతల్లా**
**ఎప్పటికీ కలవని విభిన్న ధృవాలు**
**కొత్త చీర కట్టుకున్నా**
**పూలు పెట్టుకున్నా**
**ఏమీ పట్టించుకోని క్రూర శిక్షనను భవించే శక్తి లేక**
**సంప్రదాయ పంజరం ఊచలు విరిచి**
**రెక్కలు విప్పి స్వేచ్ఛా గగనంలో**
**ఎగిరి పోదామనుకొంటాం కానీ**
**కాళ్ళకు చుట్టుకున్న అల్లిబిల్లి తీగల్లా**
**అల్లుకున్న పిల్లల్ని తప్పించుకోలేక**
**మాటల్లేని ఎడారిలో ఒంటరి ఒంటెను"**

భర్తతో బంధాలు తెంచుకుని విముక్తమవుదా మనుకున్నా, కన్నబిడ్డలు ప్రతిబంధ కాలుగా మారిన వైనం. ఓ స్త్రీ మనోగతం యిది.

యిలా..అన్నీ తడి కవితలే. దుఃఖాన్ని పెనవేసుకుని ఆవేదనని మోసుకొచ్చిన పంక్తులే.

భార్యాభర్తలిద్దరు సంపాదించిందే సంసారం గడవని పరిస్థితులు ఎన్నో చూస్తున్నాం. లేదూ విద్యావంతురాలైన భార్య ఆర్థిక స్వాతంత్ర్యం కోసం భర్తతో సమానంగా సంపాదించాలన్న మనఃస్థితి. మరి ఆ సంపాదన ఎవరి కోసం?

**"ఏడు కొండల వాడికి**
**ఏటా ముడుపు కట్టినట్టు**
**ప్రతినెలా**
**వేతన నైవేద్యం సమర్పించి**
**రోజు కూలీ కోసం చేతులు చాచే కూలీలా**
**నిత్యావసరాల కోసం భర్తముందు**
**చేతులు చాచే ఆధునిక మహిళను!"**

ఆధునిక మహిళలందరుచైతన్య మూర్తులే. ఆమె నెలసరి జీతం కోసం ముందుగా చేయి చాచి నిలబడేది భర్తేగా! యిష్టంగా యిచ్చేది ఎప్పుడూ కష్టంగా తోచదు.

**"కన్నె చెరవదలాలంటే**
**డబ్బిచ్చి కొనుక్కుంటారు బానిసలని**
**డబ్బిచ్చి కోరుకుంటారు బానిస బతుకులని**
**ఈ ప్రపంచంలో అన్నిటికన్నా**
**ఆమెను దోపిడీ చేయడం తేలిక గదా!"**

కట్నం తీసుకునే పురుషులందరు బానిసలుగాను.. కట్నమిచ్చి తలలు వంచే యువతులందరిదీ బానిస బ్రతుకులుగాను అభివర్ణిస్తున్నారు కవయిత్రి. యిది దోపిడీతో సమానమంటు ముక్తాయిస్తున్నారు. ఎన్ని తరాలు దొరలినా సమాజాన్ని పట్టి పీడిస్తున్న సమస్య యిది. కట్నం యిచ్చే సంస్కృతికి స్వస్తి చెప్పడం ఒక్కటే దీనికి పరిష్కారం.

**"ఇల్లు అద్దెకిచ్చినట్టుగా**
**గర్భ గృహాన్ని అద్దెకివ్వడానికి**
**సిద్ధమైన స్త్రీ"** మనోవ్యథ వర్ణిస్తు
**"పాలు తాగటానికి**
**పసిబిడ్డ లేకున్నా**
**ఆగక కురుస్తున్న పాల ధారలతో**
**గుండెలు సలుపుతుంటే**




**ఎవడ్రా! కూసిన మగవెధవ**
**'ఆడజన్మే మధురమని'**
**ఒక్కసారి కనిపిస్తే**
**మొహం మీద కాలి చెప్పుతో**
**ఎడాపెడా కొడితేగాని**
**మా కసి తీరదు"** అంటారు కవయిత్రి.

సాటిస్త్రీకి మాతృత్వం ప్రసాదించాలనే త్యాగ నిరతితోనో.. అవసరార్థమో తన గర్భాన్ని అద్దెకివ్వడానికి సిద్ధపడ్తున్న మహిళలు అక్కడక్కడా లేక పోలేదు. యిది పరస్పర అంగీకారంతో కుదుర్చుకున్న ఒప్పందం. ఈ విదేశీ సంస్కృతి మనదేశంలో వెర్రితలలు వేయకుండా కఠినతరమైన చట్టాలు అమలులో వున్నాయి. ఎక్కడో ఒకటో, రెండో జరిగే స్ట్రే ఇన్సిడెన్స్‌ని దృష్టిలో పెట్టుకుని "ఆడజన్మ దుర్భరం" అందామా? "ఆడజన్మే మధురమన్నంత" మాత్రాన మగ వెధవలైపోతారా?వారిని కాలి చెప్పుతో కొట్టమనడం ఏమిటి హైమవతిగారూ?

ప్రపంచీకరణ నేపథ్యంలో చిరువ్యాపారుల జీవితాలు చితికిపోయిన మాటనిజం. కార్పొరేట్ సంస్థలు చిల్లర వ్యాపారాలను కూడా ఆక్రమించేశాయి. రోడ్డుపై 'కూరగాయలమ్మాయి' కనిపించడం లేదని వాపోతారు కవయిత్రి. పక్కింటి పద్మ. ఎదురింటి వనజ వీధి చివరి "రిలయన్స్"కి వెళ్తున్నారట. తప్పెవరిది? రిలయన్స్‌దా? పద్మ, వనజలదా?

'పగిలిని పాదాలు' ఓ మాంచి హృద్యమైన కవిత. బహుళ అంతస్థుల భవన నిర్మాణంలో చెమటలు చిందిస్తున్న ఒక శ్రామికురాలు వస్తువు. యింటా, బయటా అహర్నిశలు శ్రమిస్తు పగుళ్ళు బారిన కాళ్ళతో సేదతీరే సమయం కూడా లేని అభాగ్యురాలు. "తాగుబోతు మొగుడు తందనాలు తొక్కుతుంటే" అన్న ఒక్క వాక్యంతో తనదైన మార్కు వేశారు కవయిత్రి. పురుషాహంకార సమాజంపై కవయిత్రి ఆగ్రహం అర్థం చేసుకోవచ్చు. కానీ అడుగడుగునా ద్వేషిస్తే ప్రయోజనం శూన్యం. ద్వేషంతో ఏ సమస్యా పరిష్కారం కాదు మాతృమూర్తి బ్రతికున్నప్పుడు వివక్షకు గురిచేసి, నిరాదరణతో క్రుంగ దీసిన పుత్ర రత్నాలపై చురక నంటిస్తు **"తల్లి జీవించినపుడు పట్టెడన్నంపెట్టనివారు/ మరణించాక తద్దినం పెడతారు"** అనడం బాగుంది.

కవయిత్రి హైమవతి సమాజంలో స్త్రీ దీన పరిస్థితి యిలా వుంది అని చెప్పడానికి చేసిన ప్రయత్నం ప్రస్ఫుటంగా గోచరమవుతుంది. ఎలా వుండాలనుకుంటుందో పాఠకులకే వదిలేశారు. సమస్యలను రాశులుగా ఎత్తి పోశారుగాని పరిష్కారాల జోలికి వెళ్ళలేదు. కవిత్వం చదివింతర్వాత పాఠకులు తాము యిప్పటివరకు ఏమి పోగొట్టుకున్నారో అర్థంచేసుకోవడంతో పాటు దాన్ని తిరిగి ఎలా పొందాలోనన్న దిశా నిర్దేశం కూడా కవి నుండి కోరుకుం టాడు. స్వాంతన కోసం అక్షరాలను తడుముకుంటారు. కానీ ఎక్కడా అలాంటి ఓదార్పు కనబడదు. వస్తువు ఎంపికలో కవిత కేవలం పత్రికల్లో అచ్చుగా వడం, అవార్డు పొందడమే లక్ష్యం కారాదు. ఒక రిలీఫ్ వుండాలి. సాహిత్య ప్రయోజనం వున్నదే పది కాలాలబాటు నిలబడ్తుంది.

తల్లిగా, గృహిణిగా స్త్రీలు నిర్వర్తించే బాధ్యతల్ని గూడా బాధలుగా వర్ణించడం కొంత ఆశ్చర్యానికి గురి చేస్తుంది.

**"తెహల్కా ఎడిటరే కావచ్చు**
**తెలిసిన అంకులే కావొచ్చు**
**తండ్రిలాంటి పెద్ద మనిషే కావచ్చు**
**తలపండిన విజ్ఞుడే కావచ్చు**
**ముసుగు తొలగిస్తే పశుప్రాయుడే**
**అదను చూసి పంజా విసిరే మృగాధముడే"**

అడుగడుగునా యిలాంటి దుర్మార్గులు ఎదురుబడ్తున్న సమాజంలో కవయిత్రికి తన కన్నతండ్రి మాత్రం అపురూపమైన వ్యక్తిగా కనబడటం కొంత ఊరటనిస్తుంది. 'నాన్న' కవిత చదవండి. ప్రపంచంలో ఎలాంటి నాన్నలుంటారో.. వారిలో తన తండ్రి ఎందుకు ప్రత్యేకమో అర్థమవుతుంది.

కె. శివారెడ్డి గారన్నట్టు హైమవతి మోస్ట్ కమిటెడ్ ఫెమినిస్ట్ యిదివరలో ఆమె వెలువరించిన 'సూర్యుడు తప్పిపోయాడు' మరియు 'నిషిద్ధాక్షరి' కవితా సంపుటాలపై శివారెడ్డిగారి విశ్లేషణ అధ్యయనం చేస్తే హైమవతి ఎంతటి నిబద్ధురాలో అవగతమవుతుంది.

స్త్రీల సమస్యలను ఏక వస్తువుగా గైకొని రూపొందిన కావ్యం 'నీలిగోరింట', స్త్రీలకు ఎదురవుతున్న ఏకాకితనం, వివక్ష, గృహహింస, అమానవత, హింస, అణగదొక్కబడటం, స్త్రీ పురుష సంబంధాలకు అక్షరరూపం యిస్తు బలమైన అభివ్యక్తిని పోహళించి, సూటిగా..గుండెల్లోకి.. దూసుకుపోయేలా సంధించిన వచన కవితాస్త్రాలు యిది. చదవండి.. హైమవతి కవితా శక్తిని అభినందించకుండా వుండలేరు.

ప్రతులకు: మందరపు హైమవతి
ఉరుతావారి వీధి,
ఇ.నెం. 26-15-6ఎ
గాంధీనగర్,
విజయవాడ-520 003.
సెల్: 944106



- రమణ వెలమకన్ని
సెల్: 9866015040





వాసా ఫౌండేషన్
మరియు
నేటినిజం దినపత్రిక
సంయుక్త ఆధ్వర్యంలో
ప్రముఖ రచయిత్రి డాక్టర్ వాసా ప్రభావతి
స్మారక కవితల పోటీలు

కరోనా మహమ్మారి విజృంబన నేపథ్యంలో
ప్రజలెదుర్కొంటున్న అనేకానేక సమస్యలపై దృష్టి సారించి
"వలస కార్మికులు"
అన్న అంశం మీద మీ కవితాస్త్రాల్ని సంధించండి

బహుమతుల వివరాలు:
- మొదటి బహుమతి : రూ.5000/- జ్ఞాపిక, ప్రశంసాపత్రం
- రెండవ బహుమతి : రూ.2,500/- జ్ఞాపిక, ప్రశంసాపత్రం
- తృతీయ బహుమతి : రూ.1,000/- జ్ఞాపిక, ప్రశంసాపత్రం
- 10 ప్రోత్సాహక బహుమతులు: రూ.500/- జ్ఞాపిక, ప్రశంసాపత్రం

పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రశంసాపత్రం

బహుమతులు గెలుచుకున్న కవితలతో పాటు
ప్రచురణకు ఎంపికచేసిన కవితలను 'నేటినిజం'లో ప్రచురించబడును.

నిబంధనలు:
1) కవిత 25 లైన్లకు మించకూడదు.
2) వలస కార్మికుల సమస్యలపైనే ఉండాలి.
3) అనువాద కవితలు పోటీకి అంగీకరించబడవు
4) కవితను ఏ పత్రికకు పంపలేదని, సోషల్ మీడియాలో పోస్ట్ చేయలేదని ఈ పోటీ నిమిత్తమే రాసినదని హామీ తప్పక జత చేయాలి.
5) హామీ పత్రంతో మీ పేరు, ఫోటో, పూర్తి చిరునామా తప్పని సరి.
6) ఒకరు ఒక కవితను మాత్రమే పంపవలెను.

కవితలు పంపవలసిన చిరునామా:
'నేటినిజం' దినపత్రిక, ఎస్.ఆర్.టి-74, జవహర్‌నగర్, హైదరాబాద్-20.
E-mail : netinizam2020@gmail.com

కవితలు పంపాల్సిన చివరి తేది : 15-7-2020


పుస్తక సమీక్ష

# 'రత్న గీతికలు'గా తెలుగులోకి ఉర్దూ గజళ్ళు..!

పాలమూరు జిల్లాకు చెందిన విశ్రాంత ఆంధ్రోపన్యాసకులు డా॥ ఉందేకోడు రత్నయ్య తమ మూడో గ్రంథంగా 'రత్న గీతికలు' పేరుతో ఉర్దూ గజళ్ళలను తెలుగులోకి అనుశీలనం చేశారు. సాహిత్య అధ్యయనం..అధ్యాపనం అంటే మక్కువ చూపే ఆయన ఉర్దూ భాషలోని గజళ్ళను తెలుగులోకి అనువాదం చేశారు. లోగడ తెలుగులో దాశరథి, సినారెలాంటి సాహితీ దిగ్గజాలు గజల్ ప్రక్రియను సుసంపన్నం చేశారు.

శబ్దాలంకారాలు.. అర్థాలంకారాలతో రూపుదిద్దుకునే గజళ్ళు గానం చేయడానికి యోగ్యంగా రాసేవారు. ప్రేమ, ప్రియుడు, ప్రియురాలు వగైరాలతో ముస్తాబయ్యే గజళ్లను భగ్న ప్రేమికుల హృదయ వేదనలను ఆవిష్కరించడానికి రాసేవారు. గాలిబ్ లాంటివాడు ప్రేమలో పడి పనికిమాలిన వానిని అయితిని అని వ్యాఖ్యానించాడు. గజళ్ళలో ఉక్తి వైచిత్రితో పాటు.. వ్యంగ్యం..చమత్కారం కాస్తంత హాస్యం జోడించి గజల్ కవులు తమ ఊహలకు రమణీయంగా అక్షర రెక్కలు తొడిగిపాఠకులను మెప్పించే వారు. అటువంటి గజళ్ళను రచయిత డా॥ ఉందేకోడు రత్నయ్య గారు స్వేచ్ఛా అనువాద పథాన్ని అనుసరించి తెలుగులోకి అనువాదం చేశారు.




అక్కడక్కడ రత్న గీతికలుగా రూపుదిద్దుకున్న గజళ్ళలో యతులు కుదరనప్పుడు భావం దెబ్బతినకుండా ప్రాధాన్యతనిస్తూ రచించినట్లు రత్నయ్యగారు స్వయంగా తమ ముందు మాటలో ప్రకటించారు. రెండు వందల రెండు గజళ్ళతో ముస్తాబై వచ్చిన ఈ గ్రంథంలో.మూలంకు అతి దగ్గరగా ఉండేలా రత్నయ్యగారు అనువదించారు.

ప్రముఖ సినీ నటి మీనాకుమారి, వీలునామా ప్రకారం ప్రచురింపబడిన "మీనా కుమారీకీషాయిరీ" అను పుస్తకంలోని మొదటి గీతమును రత్నయ్యగారు ఇలా అనువదించారు.

**"చంద్రుడు ఒంటరి ఆకాశము ఒంటరి**
**మనసు కలిసినది ఎక్కడో ఒంటరిగనే"** అంటూ రాశారు.

మొదటి గీతము భర్తతో అభిప్రాయ భేదాలు ఏర్పడిన తర్వాత ఆమె జీవితంలో అనువదించిన ఒంటరితనాన్ని చక్కని ఉపమానాలతో ఎంతో కవితాత్మకంగా రాశారు.

భూమి,ఆకాశం, చంద్రుడు, తారలు మనిషిలో దేహము, ఆత్మ ఇవన్నీ విడివిడిగానే ఆమెకు కనిపించాయి.

మీనాకుమారి రాసిన "తలాక్'కు సంబంధించిన గజల్‌ను ఇలా అనువదించారు.

తలాక్ అయితే పంపిస్తున్నావు.. క్రోధపు చూపులతో.. అలాగే నా యవ్వనాన్ని గూడా తిరిగి మెహర్‌తో పాటు పంపించు.. మెహర్ అనగా తలాక్ యిచ్చేటప్పుడు వాపసు యిచ్చే కట్నం.. తెలుగులో వచ్చిన 'ఆహ్వానం' సినిమాకు ఇదే ఆధారం.

మరో గీతాన్ని ఇలా తెలుగులోకి అనువదించారు.

ఒక దుఃఖాన్ని మరిపించడానికి వేల సంతోషాలు గూడ తక్కువే..జీవితాంతం నిన్ను ఏడిపించడానికి ఒక్క దుఃఖమే చాలు అంటారు.

అలాగే గాలిబ్ గజళ్ళను అనువదించి ఈ గ్రంథంలో నిక్షిప్తం చేశారు.

ప్రియురాలి పాదాలు స్పృశించుటకు అవకాశం దొరకగానే సంతోషంతో అతని కాళ్ళు చేతులు ఉత్సాహంతో ఉబ్బి పోయినాయట. ఆమె స్పర్శనెంతగా కోరినాడో స్త్రీ పాదము లొత్తుమని అడిగితే మగవాళ్ళు అవమానంగా భావిస్తారు. ప్రేమికుడు ప్రియురాలి పాదాలకు ఒత్తుమని అడిగితే అదృష్టంగా భావించి ఉప్పొంగిపోయిన అంశాన్ని ప్రస్తావించి గాలిబ్ గీతాన్ని తెలుగులోకి ఇలా అనువదించారు.

**"పాదముల నొత్తుమని యాయె పలుకగానె**
**ఉబ్బి పోయెను కాళ్లేతులు"** అంటారు

ఇంకా ఈ గ్రంథంలో.. గజళ్ళురాయడం ఖ్యాతి గడించిన హఫీజ్ జలంధరీ, జిగర్ మురాదాబాదీ, అక్బర్ ఇలహాబాది, దింగ్, బాల స్వరూప్‌రాహి, అబ్దుల్ హమీద్, ముంతాజ్ అహ్సాక్ 'జబ్బ్' ఫిరాక్ గోరక్పులీ, మక్మూర్ సయీద్, ఫిరాజ్, జోష్ మలీయాబాదీ, మనోహర్ వి, ముంతాజ్ రాహీద్, ఖలీల్ రహ్మాన్ ఆజ్మీ, అంజమ్ ఆజ్మీ, మహ్మద్ అల్వీ, చాంద్ దెహల్వీ, ఖవీ, ఏజాజ్ ఖురేషీ, అసర్‌గాండ్వీ, మజాజ్ లఖ్నవి, పాకిస్తానీ ఖలీల్ శఫయా, ఖుస్రూ, సాగర్ నిజామి, ఫానీ బదాయూనీ, తదితరులు రాసిన గజళ్ళను రత్నయ్యగారు తెలుగులోకి తెచ్చారు. వీటితో పాటు ఈ గ్రంథంలో సులేమాన్ ఖతీప్, జగన్నాథ ఆజాద్, ఆదం, అమీద్ మీనాయా, మగ్దూం మొయియోద్దీన్, నాసర్ కాజ్మీ, నిదాఫజ్లీ,బషీర్ బద్ర్,సర్వర్ "దండా" నల్ గొండలీ, గుల్జార్,ఆర్ష్ మల్‌సిఖాని, సైఫోద్దీన్ సైఫ్, ఇంద్రకుమార్ పురోహిత్ "నవాబ్", మిస్‌గోహర్ జఫల్, ఆర్షు మల్తీ ఖానీ, సాహిర్ లూధ్యాన్వీ, సాహిద్ మరియు శ్రీశైలంరాసిన గజళ్ళను రత్నయ్యగారు తెలుగులోకి అనువాదం చేశారు.

ఈ గ్రంథంలో పొందుపరిచిన వివిధ గజల్ కవుల గీతాలను సేకరించడానికి.. రత్నయ్యగారు చేసిన కృషి అభినందనీయం. అంతేగాక ఆయా గీతాల్లోని మధురిమలను తెలుగు పాఠకులకు సులభంగా ఇట్టే అర్థమయ్యే రీతిలో సరళత్వానికి పెద్దపీట వేస్తూ అనువదించారు. గజల్ మూలంకు అనువాదం చేయడంతో పాటు.. ఆయా గీతాల తాత్పర్యాలను రాసి,, మరింత విశ్లేషించి.. గజల్ పఠనంపై ఆసక్తిని కలిగించారు. ఈ గ్రంథాన్ని రత్నయ్యగారు తమ శ్రీమతి కీ॥శే॥ ఉందేకోడు లక్ష్మీ దేవమ్మకు అంకితమిచ్చారు. ఈ సందర్భంగా రత్నయ్యగారికి అభినందనలు తెలియజేద్దాం.

**ప్రతులకు:** డా॥ ఉందేకోడు రత్నయ్య
విశ్రాంత ఆంధ్రోపన్యాకులు
1-4-134/ఎ/5/2, బాయమ్మపేట
మహబూబ్‌నగర్-509 001



- దాస్యం సేనాధిపతి
సెల్: 94405 25544

# వారి పాదాల చప్పుడుతో నేల పులకిస్తుంది..!



-డా॥ కత్తి పద్మారావు
సెల్:9849741695

ప్రకృతి ప్రకాశవంతంగా జ్వలిస్తుంది
ఆ కొండల మీద పడే చినుకుల్లో ఏదో రాగం
రాగం సున్నితంగా వుంది
అనేక సంగతులు పలుకుతుంది
రాతికి కూడా శ్రుతిలయలున్నాయి
ఆ కొండ అంచున ఒక పక్షి ఒంటరిగా
నిలబడి వుంది!
ఈ లోకాన్ని తీక్షణంగా వీక్షిస్తోంది
లోకం జంటల నుండి విడిపోతూ
ఒంటరవుతూ పోతుందని గమనించింది
ఒకరు మరొకరి స్వేచ్ఛను హరిస్తున్నారా?
ఒకరు ఇంకొకరి మీద
ఆధిపత్యం వహిస్తున్నారా?
ఒకరినొకరు దోచుకోవాలని చూస్తున్నారా?
అందుకే ఒంటరిగా వుంటేనే
స్వేచ్ఛాగానం చేయవచ్చని ఆలోచిస్తుంది
అంతలో వర్షం జడిగా పడింది
చెరువులు నిండాయి
నదులు నీటి చుక్కలతో ప్రవాహశీలమయ్యాయి
పరస్పర ఉత్తేజం ప్రకృతి సహజమని
గోరింటాకు చెట్టు మీద నిలబడ్డ
రెండు గువ్వలు చెప్పాయి
నిజమే! అడవి వికసించింది
ఆ జొన్నచేను విరగబూసింది
రెండు ఒడ్రంగి పిట్టలు
ఆకాశానికి రంగులు అద్దుతున్నాయి
ఆ కొండ చరియల్లో
ప్రవహిస్తున్న సన్నని జలపాతం
కొండ గుండెల్లోని జీవనాదాలు వినిపిస్తుంది
ఆ జలపాతంలో తల తడిపిన
గదబ యువతి పాడిన పాటలతో
కొండల్లో గడ్డిపూలు పూశాయి
అవును! చెంచులు, లంబాడీలు
గదబలు, కోయలు
నెమళ్ళకు నృత్యాలు నేర్పారు కదా!
గుంపు నృత్యంలో జీవన ప్రభాతాలు
కురిపించారు కదా!
వారి పాదాల చప్పుడుకు నేల పులకరించింది
అడవిలోని చిన్న నీటి చరియల్లో
ఆ ముఖాన్ని చంద్రబింబం చేసుకున్నారు
గానుగ పుల్ల కుంచెతో వారు
పళ్ళను ముత్యపు వరుస చేశారు

అవును! వారి కురులేంటి?
వారి కనుల్లోని భావప్రవంతికి తెరలు తీస్తున్నాయి
ఆ గిరిజన పడతి కాళ్ళ మట్టెల ధ్వనికి
జలపాతాలు సవ్వడి నేర్చుకుంటున్నాయి
సింహాలు గుహల దారులు వెతుకుతున్నాయి
చినుకు, ఆమె కనురెప్పల మీదనుండి జారి
మెడలో ముత్యాల హారం అవుతుంది
ఆ గదబ యువతి కళ్ళను ప్రేమించిన వెన్నెల
ఆమె చుట్టే వల పన్నుతుంది
ఆ కన్నుల్లోని వెలుగు సొనలు
ప్రకృతి కాంతకు రంగులద్దుతున్నాయి
అవి తరగని నిధులు
ఎందుకు వీరు పెదాలకు ఎర్రని రంగులు పులిమి
ముఖ వర్చస్సును తగ్గించుకుంటున్నారు
గోళ్ళకు రంగులు వేసి,
చెప్పులకు రాళ్ళద్దిన వీరి హైహీల్స్
వీరిని అనేకసార్లు గాయపరిచాయి కదా!
వీరికి క్యాట్‌వాక్ తప్ప
నేలమీద నడవటం రాదు సుమా!
ఎండకు భయపడుతున్న వీరు
జలపాత ధ్వనికి చెవులు మూసుకుంటున్నారు
వాన చినుకులకే జ్వరపీడితులయ్యే వీరు
'నాయిక'లుగా కోట్లు గడిస్తున్నారు
పూటీలో పున్నాగ చెట్ల కింద నడుస్తున్న
ఆ పడతిపై పూలవర్షం కురుస్తుంది
వీరు ప్రకృతి నుండి జరిగే కొలది
అభద్రతకు గురవుతున్నారు
వారు ప్రకృతిలోకి జరిగే కొలది
సహజ జీవన శక్తులు అవుతున్నారు
అందుకే! మనకు నాయకురాళ్ళు ప్రకృతి జీవులే
కృత్రిమమైన బొమ్మలు కాదు
మానవోత్తేజితమైన ఆ గిరిజన స్త్రీల
జీవన గీతమే మన జాతీయ గీతం..!

## చిలక పలుకులు

క్రికెట్ కి జట్టు
క్షవరానికి జుట్టు
సంసారంలో గుట్టు
లేకపోతే వ్యర్థమోయ్ :వ్యర్థం
రైలుకు పట్టాలు
పండుగకు చుట్టాలు
నీటికి గొట్టాలు
లేకపోతే వ్యర్థమోయ్ : వ్యర్థం

కవికి కలం
రైతుకు పొలం
మొక్కకు జలం
లేకపోతే వ్యర్థమోయ్ :వ్యర్థం



–కయ్యూరు బాలసుబ్రమణ్యం
944179123

## అమ్మ

అమ్మ గర్భం లేకుంటే లేదు మనకు ఆవిర్భావం
అమ్మే లేకుంటే సృష్టికి లేదు గమనం
సకల జీవరాశులకు ప్రాణం పోసేది అమ్మ.
ప్రపంచంలో నిస్వార్థ జీవి అమ్మ
తను ఓడి పోతు కుంటుంబాన్ని గెలిపించే గృహ లక్ష్మీ.
కమ్మటి రుచులతో కడుపునింపుతుంది
క్షమాగుణం గల ఓరిమి తల్లి.
అమ్మను మించిన దైవం లేదు
అవతార పురుషుడైనా అమ్మకు కొడుకే.
మరణం అంచు దాకా వెళ్ళి
తన బిడ్డకు జన్మనిస్తుంది
తన బిడ్డలకు జ్వర మొస్తే అమ్మా
నర్సులాగా సకల సపర్యలు చేస్తుంది.

వంటింటి చిట్కాలతో అమ్మ
నయం చేస్తుంది అనారోగ్యం శాశ్వతంగా
ఏమిచ్చినా తీర్చలేనిది కన్న తల్లి ఋణం
వార్ధక్యంలో అమ్మకు తోడునీడ గా ఉందాం.
మాతృసేవే మాధవ సేవగా భావిద్దాం
మేమున్నామనే భరోసాను కల్పిద్దాం



–యాడవరం చంద్రకాంత్ గౌడ్
9441762105

## సర్వదా అక్షరసత్యం

జీవకోటిలో మనిషి మహనీయుడు
శక్తిపరుడు యుక్తిపరుడు
కానీ నేడు తాను విజ్ఞానం విపరీతమై
నాగరికం మరచి నడయాడుతున్నాడు
వివేకం కోల్పోయి వెర్రి మొర్రి చేష్టలతో
దుశ్చర్యలకు పాల్పడుతూ...
వింత వింత చేష్టలు చేస్తూ
అదే నవీన నాగరికమని భ్రమిస్తూ
తనకుతాను మురిసిపోయి
అనర్థాలకు తెర లేపుతున్నాడు
మానవుడు ఎంత విజ్ఞానవంతుడైనా
ప్రకృతిని శాశించలేడు
ప్రకృతితో చెలగాటం ప్రమాదకరం
ప్రకృతిలోని వింతలు విశేషాలు కోకొల్లలు
మనిషి మేధస్సుకు అందినది రవ్వంత

ఇంకా తెలుసుకోవలసినది కొండంత
ప్రకృతికి విరుద్ధంగా కాకుండా
ప్రకృతిని అనుసరిస్తూ బ్రతకడం శుభదాయకం
అన్నీ సజావుగా జరిగితే 'నేను' నావలననే అని
జబ్బ చరిచి విర్రవీగుతాడు మనిషి
అంతు చిక్కని సమస్య ఎదురైతే
భగవంతుడిదే భారం అని చేతులెత్తుతాడు
ఈ ద్వంద వైఖరి సరియైనది కాదు
ఎవరు ఔనన్న కాదన్నా ఒక్కటి మాత్రం నిజం
ఏదో ఒక మానవాతీత మహత్తర శక్తి
ఈ ప్రకృతికి ఊతమిచ్చి ముందుకు నడుపుచున్నది
ఇది సర్వదా అక్షర సత్యం
దానికి మానవాళి దాసోహం అనక తప్పదు.

–డా.దాసరి శ్రీనాథ్ గౌడ్
9701781696

## మధు రస ఫలరాజులు

మండుచున్న వేసవిలో
మాధుర్యాల రుచులలో
పోటి పడును ఫలరాజులు
మధురసమందించుటలో !!

వేసవి తాపానికి
మరిగే హృదయానికి
ఉపశమనము కలిగించును
జిహ్వ దాహానికి !!

మొట్ట మొదట బహు జాస్తిగ
పసుపు వర్ణ శోభితముగ
బంగినపల్లందించును
తీపి పులుపు కలబోతగ !

పైరీ మామిడి పండు
ఎరుపు రంగులో నుండు
తేనె సోక నోరులా
ఎంతో కమ్మగ నుండు !!

పండ్ల లోన రారాజు
నీలమ్ మన మహరాజు
సీజనంతగా దొరుకు
సువాసనల ఫలరాజు !!

కోత మామిడీల పండు
కోసి తింటె బలే గుండు
తిన్నకొద్ది నోటికెంతొ
తృప్తి చాల కలుగు చుండు !!

రకరకాల రసాలు
రమ్యమైన రసాలు
పంచామృతాల కన్న
పసందైన రసాలు !!

మూతి చిదిమి పీల్చినా
రసమును సేవించినా
దొరుకున ఇంటువంటి రుచి
ఎందు వెతికి చూసినా !!

చూత ఫలము సాటిగా
పుడమి లోనె లేదుగా
ఆది నుండి నేటి దాక
ఫలాలకే రాజుగా !!

టెంకలెన్నొ నాటాలే
తోటలెన్నొ పెంచాలే
తరతరముల వారసులు
ముర్సి ముర్సిగ తినాలే !!



–పోమాల హన్మంతు
9989934521.

## తొలకరికి స్వాగతం

మేఘాల సందడితో
ఆకాశం ఇప్పుడు
ఒంటరితనాన్ని కోల్పోయింది
కమ్మిన మబ్బులతో
పుడమి పచ్చదనంతో
పునీతం అవుతానని పులకరించిపోతోంది
మంచి రోజులొచ్చాయని మాగాణి
ముగ్ధ మనోహరంగా మురిసిపోతోంది
చల్లగాలి కొండ కోనల్ని పలకరిస్తూ
పున్నాగ పూల పరిమళాల్ని వెదజల్లుతోంది
చెట్టూ,చేమా చిరు సవ్వడుల
స్నేహగీతాల్ని ఆలపిస్తున్నాయి
కురిసే ప్రతి చినుకూ
పైరుకూ పామరునికి స్నేహ వారధై
బ్రతుకు చరిత్రను తిరిగి రాయడానికి
సకల సన్నాహకాలు సిద్ధం అవుతున్నాయి

నాగలి నవ్వుతూ
యేరువాక వైపు ఆశగా ఎదురుచూస్తోంది
ఇన్నాళ్లు అలసిన అన్నదాతకు ఆలంబనగా
ఆకాశం సంకోచం వీడండంటూ
చైతన్యపు లేఖను అందిస్తోంది
మేఘాలు చిట పట చినుకుల్ని వర్షిస్తుంటే
గున్నమామిడి గుబురులోంచి
పక్షులు కొన్ని తొలకరి జల్లులకు
స్వాగత గీతాలు ఆలపిస్తున్నాయి...



–మహబూబ్ బాషా చిల్లెం
9502000415

## గులాబీ

నేను సుతి
మెత్తని మనస్సు
కల దాన్ని
నన్ను చూడగానే
మనస్సు దోచే
గుణం దాన్ని
నన్ను నేను
రక్షించు కోవడం
కోసం నాశరీరంలో
ముల్లులే రక్షణ చేసుకుంటా
నేను ఎవ్వరికి
ఇష్టమైన రంగులలో
వారికి ప్రతిబింబిస్తాను

ప్రేమికుల ప్రేమకు
నిదర్శనాన్ని డెకరేషన్ కు
నేను ఆట్రాక్షనన్ గా
ఉంటా
అతిథులకు అలింగనాన్ని
గుడిలో దేవుడికి అర్చనై
అమర వీరుల జవాన్ ల
పాదల చెంతన ఉంటా
మగువ వాలు జడలో
చంద్రబింబనైతా
నేను సుతి
మెత్తని ఎవ్వరిని
నొప్పించని దాన్ని.



–చాపలమహేందర్
9949864152

## మారని వెతలు

వ్యత్యాసం ఎమీ లేదు
నాడు స్వాతంత్ర్య కాలం నాటి
కాందిశీకుల యాతనలకు
నేడు వలస కూలీల వెతలకు
తేడా ఏమీ లేదు
దశాబ్దాలుగా మారని
కథలు ఎన్నో
విషయం వేరయినా
కష్టాల సారూప్య మొకటే
నాడు పుట్టిన ఊరు నుండి
తరిమి వేయబడితే
నేడు ఉపాధి కోల్పోయి
తమకు తామే వలసలు
హత్యలు దౌర్జన్యాలు
దోపిడీలు మానభంగాలతో
కూడిన అభద్రతా
దారులు వెంట పయనం నాడు
నేడు ఆకలి కేకలు పెడుతూ
అరిగిన పాదాలతో
రక్త సిక్తమైన దారుల వెంట
పయనం .
స్వాతంత్ర్యం వచ్చిందా లేక

స్వాతంత్ర్యం కోల్పోయామో
తెలీని స్థితి లో
ఉన్న ఊరు నుండి
తరిమి వేయబడిన
కాందిశీకులు నాడు
ఉపాధి కోల్పోయి
స్వంత ఇంటికి పయనం నేడు
వలస వచ్చిన
వలసదారుల కు
స్వదేశం ఏమిచ్చిందో!
నేడు ఈ వలస కూలీలకు
తన ఊరు ఏమిస్తుందో?



– పీ.వీ.యస్.కృష్ణ కుమారి
9494510994

## కానరాని ఓ కరోనా!

ఉరుకులు పరుగుల మా జీవితాలతో
నిలకడ, నిబద్ధత తెచ్చిన కానరాని ఓ కరోనా
నీ పప్పులు మా వంటింట్లో ఉడకవు కాక ఉడకవు
అనుకోకుండా ఇంటి గోడలకే పరిమితమైన మేము
మా కుటుంబ సభ్యులతో మమేకమై వారికి చేదోడు వాదోడు
గా ఉంటూ ఒకరినొకరు మరింత అర్థం చేసుకుంటున్నాం
మా ఈ అరుదైన క్షణాలను ఆస్వాదిస్తున్నాం
ఎన్నాళ్లనుంచో బీరువాల్లో మగ్గిపోయిన పొత్తాల దుమ్ము దులిపి
మళ్లీ మళ్ళీ చదువుతూ సాహిత్య మకరందాన్ని గ్రోలుతున్నాం
భౌతిక దూరం పాటిస్తూ బంధుమిత్రులతో
చరవాణి మాధ్యమంగా మరింత చేరువౌతున్నాం
నీ పుణ్యమా అని మేము ఆర్థికంగా ఎంతో నష్టపోయినా
మా ఉనికిని కాపాడుకునేందుకు ఎంత దూరమైనా ప్రయాణిస్తాము
ఆదాయం కోల్పోయి ఆకలితో అలమటించే
బడుగు బలహీన వర్గాలకు ఆపన్న హస్తమందించే
దాతలకు కొదువ లేని దానకర్ణుల భుమిది
ప్రజల సంక్షేమానికై ఏ ఖర్చుకైనా వెనుకాడని ప్రభుత్వాలు మావి
అందుకే మమ్మల్ని ఇక్కట్లకు గురిచేసే ఆలోచనకు తిలోదకాలిచ్చి
నిను మోసే నాథుడు లేక నువు కుంగి కృషించి
మాకు కనబడకుండా లుప్తమై పోతావు కరోనా!



– అంబల్ల జనార్దన్
880349858 / 9987533225

## బతుకు పోరు

ఎండ తెలియని వాన తెలియని
మోయలేని బాధ్యతల బరువులు మోసుకెళ్లెను
ఎన్నో బరువులు అవలీలగా అలవోకగా

తెలుసునొక్కటే కాయకష్టము అదే
బడుగుజీవుల తారకమంత్రము
శ్రమను నమ్మిన శరీరమది
ఆకలితో అరిచే ప్రేగులకి ఆధారమది

ఏకధాటిగా ఎండలు మండుతుంటే
జవజీవాలే ఇంధనాలై.

ఉఛ్వాస నిశ్వాసలే ఆశ నిరాశల ఊగిసలాటలై
పొయ్యి వెలగాలంటే
పయ్య కదలాల్సిందేనంటూ
సాగుతుండెను పయనమై
కర్తవ్యనిర్వహణలో నిబద్ధుడై
బ్రతుకుపోరులో చచ్చి బ్రతుకుతూ శలభమై.



–మంజుల సూర్య
9704022244

## నారాయణి

కరోనా కాలమిదీ
కనుచూపులె పనిచేస్తయ్
ముక్కులు మూతులు
మూసుకుని కూచుంటయ్!

ఏ యిద్దరు కలుసుకున్నా
దూరం దూరం
నమస్కార బాణమే
పలకరింపు
అదే క్షేమసమాచార సూచిక...

కరోనా కాలంలో
కలకలం వలదు
నర్సమ్మలే నారాయణమ్మలు!!
కరోనా బాధితులకు
రక్షకురాండ్రు
నాడైనా నేడైనా
వారే ముఖ్యురాండ్రు
అందుకే అందుకోమని
జోడిద్దాం! కరకమలమ్ముల!!



–యెనిశెట్టి గంగా ప్రసాద్
9866447234.

## జ్ఞాపకమంటే...

మనసెంతగా
ముక్కలైపోయినా
శిధిలాల అట్టడుగు పొరల్లో
సజీవమై మిగిలిన వెలుగే జ్ఞాపకమంటే!

వెన్నెలెంతగా
పరుచుకున్నా
మది గదిలో ఏదో మూల
మిగిలిపోయిన చీకటే జ్ఞాపకమంటే!

మనసు తలుపులు తెరిచినప్పుడు
అంతా వెలుగే కాదు
కాసింత చీకటీ ప్రవేశిస్తుంది
జ్ఞాపకాల్ని తడుముకున్నప్పుడు

చేతులకు కొన్ని గాయాలూ తగులుతాయి

జ్ఞాపకాలన్నీ
అందమైన సీతాకోకలు కావు
కొన్ని జ్ఞాపకాలు
ముళ్ళతీగలు!
తలచుకున్న ప్రతీసారి
గుచ్చుకుంటూనే ఉంటాయి

ఏదేమైనా
కాలాన్ని
జ్ఞాపకాలుగా పోగేసుకుంటూ
సాగించే ప్రయాణమేనేమో జీవితమంటే!



– సాంబమూర్తి లండ
9642732008

## ఒక సీటు ఎప్పుడు ఖాళీ..

అందమైన అక్షరాలతో
నిండైన భావాలతో
సుమధుర రసాలతో
చక్కగా అలంకరింపబడిన
కవులే చక్కగా నిర్మించిన
బహుపెద్దదైన సొగసైన
కవితాపుష్పక విమానం!!

పలు భాషలతో పలురూపాలలో
వైవిధ్యభరితమైన
ఆలోచనా చక్షువులతో
నిరంతరంగా
ఎదురులేక అదుపులేక
భయపడక నీరసించక
నిర్విరామంగా నిరాఘాటంగా
గాలిలో నేలలో నింగిలో నీటిలో
దూసుకెళుతున్న కవితాపుష్పకం!

ఎంత ఎత్తైనా ఎగురుతూ
మబ్బుల్లో తేలుతూ
నక్షత్రాలను తాకుతూ
జాబిల్లి సోయగాలను
రవిని సైతం అందుకుంటూ
ఆకాశంలో దూసుకుపోతుంది!!

సముద్ర గర్భంలో దాచిన
మణులనే కాదు
బడబాగ్నులను వెలికితీసి
మానవ అంతరంగాలలో
వీరవిహారం చేస్తూనేఉంటుంది!!

నేలపైనా ఊరేగి
ఒంపులు పోతూ గిరగిరా తిరుగుతూ
ఒయ్యారాలు ఒలకబోస్తూనే

అకారణంగా ఎదురొస్తే
అఘాయిత్యం అన్యాయం చేస్తే
మీదమీదకు మదిలోకి దూసుకుపోయి
ఆరాటం పోరాటం చేస్తూనే
కవితాఝరులతో నింపేసుకుంటుంది!!

ఎంతమంది కవులు ఎన్నిరకాల
కావ్యాలు గుప్పించినా
ఎన్నెన్ని ప్రక్రియలు రాసినా
ఎడతెగక కవితాపోరు చేసినా
అదరదు బెదరదు
కాలాలు మారినా గాయాలు చేసినా
కొత్తగా కవులు పుట్టుకొస్తున్నా
నేనున్నానంటూ ప్రోత్సహిస్తూ
వెన్నంటి ఉండి
అలసిపోక సొలసిపోక
ఎల్లప్పుడూ ఆగక నడిచే
నిత్య విహారి!!

ఎన్ని ఆలోచనల భారం నింపినా
ఆనందంగా ఎక్కించుకున్నా
విరామమెరుగని పయనం
నిత్యనూతనం..
వర్ణ శోభితం..
నవరస భరితం..
నానాలంకార భూషితం..
సీట్లేన్నో ఉండి నిండినట్టన్పించినా
ఫీట్లేన్నో చేస్తున్నా
అది కవితాపుష్పకం
ఎప్పుడు ఒక సీటు ఖాళీనే!!



–డా.చీదెళ్ళ సీతాలక్ష్మి
9490367383

## విజ్ఞానమే మానవప్రగతి...!

తెలియనిది తెలుసుకుంటే
నవవిషయం కనుగొంటే..
సమాజానికిమేలుకద..
శాస్త్రజ్ఞులుతలచుకుంటే!

శాస్త్రాలు పెక్కు గలవు
జ్ఞానానికి నవి కొలువు
పదార్థాల పరిశోధిస్తే
విజ్ఞానానికవియెనెలవు!

రోగులకుమందులెన్నో
కనిపెట్టిచ్చిందెన్నో
ప్రాణాలను నిలబెట్టెడి
శాస్త్రజ్ఞులకిలనతులెన్నో!

బస్సుల కనిపెట్టినారు
రైళ్ళను కని పెట్టినారు
విమానాలలో విహారం
చేయించిన ఘనులువీరు!

శాస్త్ర జ్ఞానవికాసం
మనో ధర్మ ప్రకాశం
మానవజాతి కంతా
తెలియుటెంతసంతసం!

మహియందుకలదు జ్ఞానం
అగ్నిలోనయు సుజ్ఞానం
జలంలో నిండి లేదా
గాలి గగనపు ప్రజ్ఞానం!

రోదసిలో కాలుమోపి
మేధస్సుతోతలలూపి
ఖగోళాన్నే జయించిరి
శాస్త్రజ్ఞులే తెగువజూపి!

మట్టిలోన విజ్ఞానం
మనిషియే మహజ్ఞానం
వచ్చె నవయువతరాలకు
అందివ్విక సుజ్ఞానం!

జ్ఞానానికి హద్దు లేవి
సాంకేతిక కెల్ల లేవి
అరచేతిలోన జ్ఞానం
అందుతుందిమనకులవి!

వెలుగు తుందిక విజ్ఞానం
ఎదురులేనిది ప్రజ్ఞానం
జనజీవన భాగ్యామే
విశ్వ ప్రగతికి సోపానం!!!!



–డా. గన్నోజు
శ్రీనివాసాచారి
8555899493

## అస్తిత్వం

అభిమానం కనిపిస్తే..సాదరంగా ఆహ్వానిస్తా
అభినందన మాకోసం వస్తే
సంతోషంగా స్వీకరిస్తాం!
అనుమానం మావంక క్రీగంట చూస్తే
అది తొలగించేందుకు చర్చిస్తా
అవమానం మమ్మల్ని తాకాలని చూస్తే.
అధఃపాతాళానికి తొక్కేస్తాం!
అపజయాలు చుట్టుముడితే
పోరాడి ఓడించే ఆత్మవిశ్వాసాలం..
ఆశలు.. నిరాశలుగా మారే క్రమంలో
పునరుజ్జీవం పొందే సంకల్పశక్తులం!
కష్టం– నష్టం మమ్మల్ని భయపెడితే
ఎదురొడ్డి ఎదుర్కొనే ధీరులం
ఆనందానికి మేమే ఆత్మబంధువులం...

అనురాగానికి మేమే నిలువెత్తు రూపం !
ఆత్మీయతకు మేమే కారకులం
ఆహ్లాదానికి మేమే అసలుకారణం
ప్రేమకు మేమే అక్షయపాత్రలం
ప్రేమరాహిత్యానికి మేము ఆమడ దూరం !
కష్టం– నష్టం – నిరాశ – విషాదం– దుఃఖం
ఏది ముంచెత్తినా చెక్కుచెదరని నిశ్చలహృదయులం
అన్నింటినీ స్వీకరించి, సమస్తాన్ని సహించి
సహృదయతతో మెలిగే స్థిరచిత్తులం
అందరినీ ఆదరించే స్థితప్రజ్ఞులం !
మేమే.. మేమే..మేమే.. మహిళలం
ఈ సృష్టి చైతన్యానికి మేమే కదా పునాదులం !!

–మంజులభావన

**నేటినిజం** చందా వివరాలు

ప్రతి వారం ప్రచురిస్తున్న 'సాహితీ కెరటాలు' గల 'నేటినిజం' 260 సంచికలు + పోస్టల్ ఛార్జీలు కలుపు కుని 5 సం॥రాలకు రూ.700/–, 10 సం॥రాలకు రూ 1200/– మీ చందాను 'నేటినిజం' తెలుగు దినపత్రిక పేరిట ఎం.ఓ. లేదా డిడిగానీ, ఈ క్రింది అడ్రసుకు పంపగలరు. లేదా SBI 3056 7652 629, IFSC: SBIN 0011660 Gandhi Nagar Branch Hyderabad-80 అకౌంట్‌లో వేయవచ్చును.

'నేటినిజం' దినపత్రిక, ఎస్ఆర్‌టి–74, జవహర్‌నగర్,
హైదరాబాద్–500 020.

## కవితా పుష్పకం

నా మస్తిష్కాన్ని మదించి
అంతరార్థాలను వెలికితీసి
ఆలోచనలను తట్టి లేపి
హృదయాన్ని సంస్కరించి
సమాజ శ్రేయస్సును ఎంచేదే
నా కవితా పుష్పకం !

అక్షరాలను దిద్దించి
అసమానతలను తొలగించి
విద్యాబుద్ధులు నేర్పించి
అజ్ఞానాన్ని తొలగించి
అంధకారపు చీకట్లను చీల్చి
వెలుగు దివ్వెలు నింపేదే
నా కవితా పుష్పకం !

అజ్ఞానుల మెదళ్లను తొలిచి
విజ్ఞాన గుళికలను అందించి
సత్ జ్ఞానాన్ని అందించి
సచ్చీలతను బోధించి
మేధస్సును అందించి
తిమిరాలను సంహరించేదే
నా కవితా పుష్పకం !.
తెల్లటి పొలంలో నల్లని విత్తనాలు నాటి
జీవితముపై ఆశలను చిగురింప హాజేసి
వెట్టిచాకిరి బాసిన బతుకులకు
విముక్తి అందించి
అక్షరాల తోటలో చదువుల
పుప్పొడికై పరిగెత్తించి
మోడువారిన బ్రతుకుల్లో

పచ్చటి ప్రకృతి అందాలు ఆరబోస్తూ
జీవితానికి స్వర్గ తోరణాలు
అల్లేదే నా కవితా పుష్పకం!

మట్టి మనుషులను మహోన్నతులుగా మార్చి
ఖాళీ మెదళ్ళకు అక్షర
ఆయుధాలను అందించి
బాలల బంగారు భవిష్యత్తుకు బాటలు వేసి
నేటి బాలలను రేపటి భావి భారత లకు
శీలనిర్మాణం చేసేదే నా కవితా పుష్పకం!



–కోణం పర్శరాములు
959524585

## నేటి నిజాలు



## కనువిప్పు

దునియా మొత్తం దులిపేశావు
నువ్వంటే ఏమిటో రుచి చూపించావు.
భూగోళం మొత్తం గుబులు పుట్టించావు.
నీకు నీవే సాటిగా మారి విజృంభించావు.
కంటికి కనిపించని శత్రువుగా మారావు.
ప్రపంచం అంతటా మరణమృదంగం మోగిస్తున్నావు.
మేము చేసిన తప్పులే మాకు ఎత్తి చూపిస్తునావు.
బంధాలు అనుబంధాలను ,
ఆప్యాయత అనురాగాలను గుర్తుచేస్తున్నావు.
నేను మనిషిని అనే సంగతి మరచిన మానవునికి,
మానవత్వం విలువలను నేర్పుతున్నావు.
ఆకాశంలో కలల సౌధంలో విహరిస్తున్న
కలియుగ మానవున్ని నేలమీద నడిచేలా చేస్తున్నావు.
అధునాతన అలవాట్లకు అలవాటుపడ్డ మనిషిని
హెచ్చరిస్తున్నావు.
ప్రకృతిలోకి తిరిగి వెళ్లమంటున్నావు.
ప్రపంచానికి భారత సంస్కృతిని తెలియజేస్తున్నావు.
నమస్కారమే మన సంస్కారమని,
ఇదే మన జీవన విధానమని
దునియాకు దారి చూపిస్తున్నావు.
తాయిత్తులు తావీజులు ,మంత్రాలు జపాలు ,
నా ముందు చెల్లవంటున్నావు
.దవాఖానలో తెల్లకోటేసుకొని శాంతి కపోతంలా,
కరోనాకు ఎదురు తిరిగి నిలుస్తున్న
డాక్టర్లే దేవుళ్లంటున్నావు.
శాస్త్రసాంకేతిక వైద్యం ,
విద్య వైపు దృష్టి పెట్టమంటున్నావు
సపాయి కార్మికులే సిపాయిలు అంటున్నావు
లాఠీ తో డ్యూటీ చేసే పోలీసన్నలే
మన రక్షకులు అంటున్నావు.
కరోనా.........
నువ్వు నేర్పిన పాఠం
జీవితాంతం ఆచరించమంటున్నావ్
మాకు కనువిప్పు కలిగిస్తున్నావు



–అశోక్ గొనె
9441317361

# లాక్‌డౌన్ (కథ)



–పొత్తూరి జయలక్ష్మి
సెల్:9490233148

'ప్రతిరోజూ ఎగ్జామ్. చదివిందే చదివి, చదివిందే చదివి బుర్ర వేడెక్కిపోతున్నది. ఛీ! ఛీ! ఏం చదువో ఏంటో'

అమ్మయ్య! ఎగ్జామ్స్ అయిపోయాయని ఊపిరి పీల్చుకుందామంటే ఎమ్‌సెట్, మెయిన్స్ వగైరా వగైరా వాటికి కోచింగ్ అంటూ ఉక్కిరి బిక్కిరి అయ్యే షెడ్యూల్‌తో మళ్ళీ కాలేజీ మొదలు. ప్రతిరోజూ ఎగ్జామ్. చదివిందే చదివి, చదివిందే చదివి బుర్ర వేడెక్కిపోతున్నది. ఛీ! ఛీ! ఏం చదువో ఏంటో, అని నిట్టూరుస్తూ కాలేజీలో రేపు జరగబోయే ఎగ్జామ్‌గురించి ఆలోచిస్తూ చేతిలోవున్న పుస్తకాన్ని పక్కనపెట్టి కొంచెంసేపు కళ్ళు మూసుకున్నాడు కృష్ణ.

హాల్లో టీ.వీ మోగుతున్నది. ష్.... సౌండ్ తగ్గించు. వాడక్కడ చదువుకుంటున్నాడు అంటున్నాడు నాన్న. వాడి మొహం చదువు. ఎప్పుడూ ఫ్రెండ్స్‌తో చాటింగ్‌లే అంటున్నది అమ్మ. ఇవన్నీ వినపడుతున్నా వాళ్ళు అంటున్నది నన్ను కాదులే అనుకుంటూ కళ్ళు తెరిచి చదవటానికి ప్రయత్నిస్తున్నాడు కానీ చేతిలోవున్న పుస్తకంపై ధ్యాస పెట్టలేకపోతున్నాడు. ఒకవేళ రేపు జరగబోయే పరీక్షలో మార్కులు తక్కువొస్తే....? ఇదే ఆలోచన అతని మదిలో గింగిర్లు తిరుగుతున్నది. ఆర్టీసి బస్సుల్లోపడి కాలేజీకి పోవాలి. ఎగ్జామ్ కాగానే మళ్ళీ బస్సుల్లోపడి ఇంటికొచ్చేసరికి దిమ్మ తిరిగిపోతున్నది. ఏమన్నా అంటే మగపిల్లాడివి, ఆమాత్రం కష్టపడకపోతే ఎలా? చదువంటే కష్టపడాలీ? ఇప్పుడు కష్టపడితేనే రేపు నువ్వు సుఖపడేది అంటుంది అమ్మ. అనుభవించేవాడికి తెలుస్తాయి కాలేజీ కష్టాలు, చదువు బాధలు.

మర్నాడు యధావిధిగా కాలేజీలో జరిగే పరీక్షకు హాజరై సాయంత్రం ఆరున్నరకి దిగాలుగా ఇంటికి చేరిన కృష్ణ ఫ్రెష్షప్ అయి టీ.వీ.ముందు కూర్చొని రిమోట్ చేతబట్టుకొని ఛానల్స్ మారుస్తున్నాడు. అందులో ఒక ఛానెల్‌లో 'బ్రేకింగ్‌న్యూస్' అంటూ ఒక ఎనౌన్సర్ ఏవేవో విషయాలు చెప్పుకుపోతున్నది. చేతిలోవున్న రిమోట్‌ని ఆ ఛానల్ దగ్గర ఆపి, శ్రద్ధగా వినసాగాడు కృష్ణ. ఏదో కొత్త వైరస్ వేరే దేశంనుండి మనదేశంలోకి ప్రవేశించిందని, దాని బారినపడి ఇప్పటివరకు ఎన్నో వందలమంది మృత్యువాత పడ్డారని, ఆ వైరస్‌ను తరిమికొట్టాలంటే జనం గుంపులుగా కలిసి తిరగరాదనీ, ఒకరినొకరు షేక్‌హ్యాండ్‌కూడా ఇచ్చుకోకూడదనీ, ఎదుటి వ్యక్తి తుమ్మినా, దగ్గినా వారినోటినుండి వచ్చే తుంపరలు వేరే వారిపైబడి వీరూ రోగగ్రస్తులవుతారనీ, అందుకుగాను ముందు జాగ్రత్త చర్యగా రేపు, ఎల్లుండి జనతాకర్ఫ్యూ విధిస్తున్నట్లు, ఉదయం ఏడుగంటలనుండి ఈ కర్ఫ్యూ అమలులోవుంటుందనీ, రూల్స్‌ని అతిక్రమిస్తే చట్టరీత్యా కఠినచర్యలు తప్పవనీ సి.ఎం. స్పీచ్ ఇస్తున్నాడు.

ఇవన్నీ వింటున్న కృష్ణకి ఒకపక్క ఆనందం, మరోపక్క ఈ రూల్సన్నీ మా కాలేజీవారు పాటిస్తారా అనే అనుమానం. రెండూ మనసులో మిళితమై ఆదుర్దాగా అమ్మా! అమ్మా! అంటూ గట్టిగా కేకేశాడు.

"ఏంట్రా కృష్ణా! అంత పెద్దగా పిలిచావ్. నేను ఇక్కడే ఉన్నాగా" అంటూ చేతిలోవున్న గిన్నెను పక్కనేవున్న డైనింగ్‌టేబుల్‌పై పెట్టి కంగారుగా హాల్లోకొచ్చింది భారతి.

"ఏంలేదమ్మా! ఇలా వచ్చి కుర్చీలోకూర్చో" అంటూ కుర్చీని జరిపి మెల్లిగా తన బ్యాగులోనించి ఒక కాగితాన్ని తీసి భారతి చేతిలో పెట్టాడు కృష్ణ.

"ఏంటిరా ఇది? కాలేజీలో చేయరాని పని ఏమన్నా చేశావా" అంటూ గాబరాగా ఆ కాగితాన్ని చేతిలోకి తీసుకొని మెల్లిగా మడత విప్పి చదవటం మొదలుపెట్టింది. అది కాలేజీ యాజమాన్యం పేరెంట్స్‌కి పంపిన సమాచారం. అందులో రేపటినుండి పరీక్షలయ్యేంతవరకు మీ పిల్లవాడు మా పర్యవేక్షణలో మావద్దే ఉంటాడు. అతనికి కావలసిన తిండి–తిప్పల బాధ్యత మాదే, వాళ్ళ బాగోగులు మేమే చూసుకుంటాం. మేమే దగ్గరుండి వాళ్ళని చదివిస్తాం. మా కాలేజీకి ర్యాంకులు రావాలంటే బాగా చదివే పిల్లలని కొంతమందిని పరీక్షలకు ఓ ఇరవైరోజులముందునుండే మా దగ్గర ఉంచుకొని రాత్రింబవళ్ళు చదివించి మంచి ర్యాంకులు వచ్చేలా సానపడతాం. దీనికి మీరు మాకు సహకరించాలి. దయచేసి మీ పిల్లవాడికి కొన్ని జతల బట్టలు, పేస్ట్, బ్రష్, సబ్బుల్లాంటివి ఇచ్చి, రేపు ఉదయం పది గంటలకు పేరెంట్స్ స్వయంగా వచ్చి పిల్లవాణ్ణి మాకు అప్పగించి వెళ్ళాలి. ఇదీ ఆ కాగితంలోని సారాంశం.

చదవటం ముగించి మళ్ళీ కాగితాన్ని మడత పెడుతూ కృష్ణవైపు తలతిప్పి చూసింది భారతి. కృష్ణ అయిష్టంగా అదోలా మొహం పెట్టి, బేలగా తల్లి వంక చూస్తూ "బాగా చదవటంకూడా నేరమేనా అమ్మా! అక్కడుండి రాత్రింబవళ్ళు చదివితేనే చదువా చెప్పు. అక్కడుండి చదవటం నాకిష్టంలేదు. మామూలుగానే వాళ్ళు అనుకున్నదానికంటే ఒక్క మార్కు తక్కువొచ్చినా వాళ్ళు తిట్టే తిట్లు అసలు భరించలేం. ఛీ! ఎందుకొచ్చిందీ పాడు చదువు అనిపిస్తుంది. నేను ఇంట్లోనేవుండి పరీక్షలకు ప్రిపేర్ అవుతాను. నేను రాత్రింబవళ్ళూ కూర్చుని చదవలేను. నన్ను బలవంత పెట్టొద్దు" అన్నాడు కృష్ణ ఒకింత బాధగా.

"నువ్వేమీ బాధపడొద్దులే. ఆ విషయం గురించి తరువాత ఆలోచిద్దాం" అంటూ టీ.వీ.వైపు దృష్టి సారించింది భారతి. అందులో రేపటినుండి అమలు కాబోయే జనతాకర్ఫ్యూ గురించి పదే పదే చెబుతున్నారు. అవన్నీ శ్రద్ధగా విన్న భారతి కృష్ణ భుజంపై చేయి వేసి, "అయినా రెండురోజులు జనతాకర్ఫ్యూ అంటున్నారుగా. మీ కాలేజీవాళ్ళు అనుకున్నవన్నీ ఏమీ జరగవులే. ఈ విషయం మెల్లిగా మీ నాన్నతో మాట్లాడి ఒక నిర్ణయానికి వద్దాం. ప్రస్తుతం నువ్వు నిశ్చింతగా ఉండు" అంటూ ధైర్యం చెప్పి తన పనిలో తాను నిమగ్నమయిపోయింది భారతి.

మరో గంటలో, 'మీకు తెలియపరచిన విధంగా మీ పిల్లలను రేపు ఉదయం కాలేజీకి తీసుకురానవసరంలేదు (జనతాకర్ఫ్యూ కారణంగా) తదుపరి విషయాన్ని మరలా తెలియజేస్తాము' అని కాలేజీనుండి భారతి సెల్‌కి మెసేజ్ రానేవచ్చింది. ఆ మెసేజ్‌ని కృష్ణముందుంచింది భారతి. కృష్ణ పెద్ద భారం తీరినట్లు ఒక నిట్టూర్పు విడిచి, ఇప్పుడు కొంచెం ప్రశాంతంగా ఉండొచ్చు. ఎగ్జామ్ ముందు మరొకసారి రివిజన్ చేసుకుంటేచాలు అని మనసులో అనుకుంటూ, పుస్తకాల బ్యాగ్‌ను పక్కనున్న టేబుల్‌పైకి విసిరేశాడు.

×××

వార్తలు విందామని టీ.వీ. అన్ చేశాడు కృష్ణ. అందులో ఈ జనతాకర్ఫ్యూ వలన ప్రయోజనం ఏమీ పెద్దగా కనబడలేదనీ, ఆ వైరస్ ఇంకింత విజృంభించి, ఉధృతంగా వ్యాప్తి చెందుతున్నదనీ, గత మూడు రోజుల్లో 40మంది ఈ వైరస్ బారిన పడి ప్రాణాలు వదిలారనీ, దీనికి ప్రత్యామ్నాయం లాక్‌డౌన్ అమలు చేయడమేననీ, దీనికి ప్రజలంతా సహకరించాలనీ, నియమనిబంధనలను అతిక్రమించినవారు శిక్షార్హులనీ అధికారికంగా ప్రకటన చేసినట్లు చెబుతున్నారు. ఆ వార్తలు వినగానే కృష్ణకు అగమ్యగోచరం అయిపోయింది.

20 రోజులు లాక్‌డౌన్‌ట. మరి ఎమ్‌సెట్...? పోస్ట్‌పోనా..? పోస్ట్‌పోన్ అయితే మళ్ళీ ఎప్పుడు పెడతారో? వైరస్‌కు భయపడి ఈ లాక్‌డౌన్‌ను ఇంకా పొడిగిస్తూ పొడిగిస్తూ పోయి, లాక్‌డౌన్ ఎత్తేసిన వారం రోజుల్లోనే పరీక్షలంటే....? ఇంకా మాకు రివిజన్ కావలసిన చాప్టర్స్ కొన్ని మిగిలున్నాయి. మరి వాటి సంగతేంటో? అని ఆలోచిస్తూ అమ్మా! అని బిగ్గరగా పిలిచాడు.

"ఏం కావాలిరా కృష్ణా!" అంటూ హాల్లోకి వచ్చిన భారతితో "మనకి 20 రోజుల లాక్‌డౌన్ ప్రకటించింది ప్రభుత్వం. విద్యాసంస్థలన్నీ మూసివేయాలట. మరి నా చదువూ...?" అన్నాడు కృష్ణ.

"ఏం పరవాలేదు. దాన్ని గురించి ఆలోచించేదేముంది. ఇంట్లోనేవుండి చదువుకో, ఇది మంచి అవకాశం కూడా" అంది భారతి.

"చదువుకుంటాను సరేగానీ నా స్టడీ మెటీరియల్ కొంతవరకూ కాలేజీలోనే ఉండిపోయింది. ఇప్పుడెట్లా? ఏం చేయాలి?" అన్నాడు ఒకింత కంగారుగా కృష్ణ.

"చేసేదేమీ లేదు. నీ దగ్గరున్న మెటీరియల్ చదువుకోవటం, పరీక్షలు రాయటం. అంతకన్నా వేరే మార్గం లేదన్నది భారతి.

"రాస్తాను సరే. నేననుకున్న గోల్‌ని సాధించలేకపోతే....? నలుగురిలో నవ్వులపాలు" అన్నాడు కృష్ణ.

ఆ రోజు రాత్రి పడుకున్నాడేగానీ నిద్రపట్టడంలేదు కృష్ణకి. మా కాలేజీ ఆశలన్నీ మీ 20మంది మీదేరా. కాస్త కష్టపడి చదివి మీకూ, మాకూ మంచి పేరు తీసుకురండి అని నయానాభయానా చెపుతున్న ప్రిన్సిపల్ మాటలు గుర్తుకొస్తున్నాయి. చటుక్కున లేచి పుస్తకాలు ముందేసుకు కూర్చున్నాడు కృష్ణ. పేజీలు తిప్పుతున్నాడుకానీ ఎక్కడినుండి మొదలుపెట్టాలో అర్థంకావటంలేదు.

ఇంతలో పక్క గదిలో పడుకున్న నాన్న "కృష్ణా! టైమ్ మూడున్నరైయింది. చదివింది చాల్లే ఇంక పడుకో" అన్నాడు గట్టిగా అరిచినంత పనిచేస్తూ.చేసేదేమీ లేక లైట్లు ఆర్పేసి పడుకున్నాడు కృష్ణ

మర్నాడు ఉదయాన్నే ఈ రోజునుండి పది గంటలకి, ఒంటిగంటకి, ఐదు గంటలకి ఆన్‌లైన్ క్లాసులు ఉంటాయనీ, వాటికి తప్పక అటెండ్ అవ్వాలనీ, డౌట్స్ ఏమైనా ఉంటే లెక్చరర్స్‌ని అడిగి నివృత్తి చేసుకోవచ్చనీ మెసేజ్ పెట్టారు. ఆ విషయం తెలుసుకున్న కృష్ణ కొంచెం తృప్తిపడి వారు ఆదేశించిన యాప్‌ని డౌన్‌లోడ్ చేసుకొని క్లాస్‌కి రెడీ అయినాడు. క్లాస్ మొదలై పదినిమిషాలయిందో లేదో వింత వింత అరుపులు, పిచ్చి పిచ్చి కామెంట్స్‌తో క్లాస్‌ని డిస్టర్బ్ చేయటం మొదలుపెట్టారు. ఆ లెక్చరర్స్ ఎంత వార్నింగ్ ఇచ్చినా ఫలితం లేకపోయింది. క్లాస్ అర్ధాంతరంగా ముగిసింది. ఆ తరువాత కొన్నాళ్ళదాకా మరలా క్లాస్‌ల ఊసే లేదు.

ఎంత లాక్‌డౌన్ ఉన్నా వైరస్ చాపకింద నీరులా వ్యాపిస్తూనేవుంది. వందలకొద్దీ మృత్యువాత పడుతున్నారు. ప్రభుత్వం చేసేదేమీలేక లాక్‌డౌన్‌ని మరలా 20 రోజులు పొడిగించింది. పర్యవసానంగా ప్రజాజీవనం స్థంభించిపోయింది. ఆకలి చావులు మొదలయ్యాయి. ఎడాపెడా మరణఘోషను వినలేక ప్రభుత్వం లాక్‌డౌన్‌లో కొన్ని సడలింపులను ఇచ్చింది. దాంతో ప్రజల్లో మరింత విచ్చలవిడితనం పెరిగి, వైరస్ మూడు పువ్వులు ఆరుకాయలుగా పెరిగిపోతున్నది.

×××

లాక్‌డౌన్ అయిపోగానే అన్ని జాగ్రత్తలు తీసుకుంటూ వచ్చే నెల 10న ఎమ్‌సెట్ అని పొద్దున్నే వచ్చిన న్యూస్‌పేపర్‌లో హెడ్‌లైన్స్. పేపర్ తిరగేస్తున్న రాఘవ "అరేయ్ కృష్ణా! ఇక నిద్రలేవరా. ఎమ్‌సెట్‌కి డేట్ వచ్చింది" అని బిగ్గరగా పిలిచాడు. ఆ పిలుపుకి కృష్ణ ఒక్క ఉదుటున లేచి కూర్చున్నాడు. రాఘవ చేతిలోని పేపర్ తీసుకొని విపులంగా చదివి, త్వరత్వరగా పనులు ముగించుకొని పుస్తకాలు ముందేసుకుని కూర్చున్నాడు. గుండెల్లో ఒకటే గాబరా. ఎమ్‌సెట్ దగ్గర పడుతుండటంతో రాత్రింబవళ్ళు చదువుతూనేవున్నాడు.

రాత్రి మొత్తంమీద గంటో రెండు గంటలో నిద్రపోతున్నాడు అంతే. ఒకపక్క ఎగ్జామ్ ఫియర్, మరో పక్క వైరస్ భయం కృష్ణని అతలాకుతలం చేస్తున్నాయి. దాంతో చదివిందే పదిసార్లు చదవాల్సి వస్తున్నది.

నిద్ర తక్కువైనందుకో ఏమో కళ్ళు మండుతున్నాయి. చిన్నగా తలనొప్పికూడా మొదలయ్యింది. ఈ విషయాన్ని అమ్మానాన్నలకి చెప్పాడు కృష్ణ. ఇంట్లోవున్న పేరాసిట్మాల్ వేసి ఈ రోజుకు చదువుమాని పడుకోమని సలహా ఇచ్చింది భారతి. అలా పడుకున్నాడో లేదో గాఢ నిద్రలోకి జారుకున్నాడు కృష్ణ.

×××

ఎల్లుండే ఎగ్జామ్ కదా త్వరగా టిఫిన్ తిని, సెంటర్ చూసుకు వస్తానని బయలుదేరి బస్టాండ్‌లో బస్‌కోసం ఎదురుచూస్తూ నుంచున్నాడు కృష్ణ. బస్సులయితే ఒకదానివెంట ఒకటి వస్తున్నాయి కానీ పదిహేనుమందిని ఎక్కించుకోగానే బస్ రయ్‌మని వెళ్ళిపోతున్నది. లైన్‌లో చాలామందే జనం ఉన్నారు. బస్ ఎక్కుతాననే ఆశ సన్నగిల్లుతున్నది కృష్ణలో. అంతలో అటుగా ఒక టూవీలర్ రావటం గమనించి 'లిఫ్ట్' అన్నాడు చేతిని చూపిస్తూ. ఆ టూవీలర్ అతను లిఫ్ట్ ఇచ్చాడు. సెంటర్‌ను చూసుకున్న కృష్ణ. ఇంటికొచ్చి అన్నంతిని పడుకున్నాడు. క్షణంలోనే నిద్రపట్టింది. ఒళ్ళంతా ముచ్చెమటలు పోస్తున్నాయి.ఆయాసంగా ఉంది. నూటనాలుగు జ్వరం వచ్చినట్లు ఒళ్ళు కాలిపోతున్నది. ఊపిరందక మూలుగుతూ అవస్థ పడుతున్న కృష్ణని అంబులెన్స్‌లో తీసుకుపోయి హాస్పటల్‌లో ఎడ్మిట్ చేసారు. వైద్యం జరుగుతున్నది.

ఒద్దూ, ఒద్దూ! నాకేం కాలేదూ. నన్నొదిలేయండీ! నేను ఎమ్‌సెట్ రాయాలీ అంటూ పెద్దగా కేకలు పెడుతున్నాడు కృష్ణ. అంతలో పక్క గదిలో నిద్రపోతున్న భారతి, రాఘవలు పరుగు పరుగున కృష్ణ గదిలోకొచ్చారు. మంచంమీద పడుకున్న కృష్ణ వణికిపోతున్నాడు. ఏదేదో మాట్లాడుతున్నాడు, ఏడుస్తున్నాడు. వెంటనే రాఘవ, కృష్ణని గట్టిగా పట్టుకొని "నాన్నా! ఏమైందిరా లే. ఏమైంది చెప్పు" అంటూ కృష్ణ పక్కనే కూర్చొని, మీద చెయివేసి లేపే ప్రయత్నం చేశాడు. కృష్ణకి మెలకువ వచ్చి రాఘవని గట్టిగా పట్టుకొని "నాకేం కాలేదు. ఏదో పీడకల వచ్చినట్లుంది. 'అయామ్ అఫ్రైడ్ ఆఫ్ లాక్‌డౌన్ & వైరస్' నాన్నా" అన్నాడు లో గొంతుకతో.

"నీకేం పరవాలేదురా. అన్ని మంచిగానే జరుగుతాయి. ధైర్యంగా ఉండాలి" అంటూ కృష్ణని ఆప్యాయంగా దగ్గరకు తీసుకున్నాడు రాఘవ.

## జవాబు రాని ప్రశ్న

నా జీవితం నాకు కనిపించకుండా
పోయిందేమిటీ?
ఈ మధ్యే నా నుండి పారిపోయింది
దానికి భయమేసినట్టుంది
నామతం తెలియకే నా కులం తెలియక
నేను పుట్టిన స్థలం తెలియక
పాలకులు పరేషాన్ చేస్తున్నప్పుడు
జీవితం ఏమి చేస్తుంది!
పారిపోతుంది!
ఇప్పటిదాక నానేల నా భారత్ ఈగాలి
అన్నీతనవే అనుకుంది
ఆధారాలు లేని నిరాధార బ్రతుకు జీవితానిది
భయంతో పారిపోయింది
ఏ చట్టాల ముళ్లకంపలో ఇరుక్కుందో
ఏ రాళ్ల దెబ్బలకు గాయాల పాలయ్యిందో
ఏ లాఠీ దెబ్బలకు చతికిల పడిందో
నా జీవితం
నాకు కాకుండా చేసిందెవరో.



– సి.హెచ్.మధు
సెల్: 9949486122

## వారసత్వం

వారసత్వం కొందరికి వరమై
జీవితాన్ని నందనవనం చేస్తే
మరికొందరికి శాపమై
అరణ్య రోధననే మిగులుస్తుంది.

వారసత్వంగా వరించే విజయం
ఆనందాన్ని,అధికారాన్ని ఇవ్వొచ్చుగాక
ఆత్మ సంతృప్తిని మాత్రం ఎప్పటికీ ఇవ్వలేదు.

శ్రమతో పొందిన విజయం
అంతులేని ఆనందాన్ని
అంతకు మించిన ఆత్మ సంతృప్తిని .

ఖచ్చితంగా ఇవ్వగలదు
ఏదైనా వారసత్వంగా సంక్రమిస్తే
అందులో మన గొప్పేముంది
మనకంటూ స్వంత గుర్తింపు ఉండాలి
అది అసలు సిసలైన గుర్తింపు..



–బస్వ రాజ్ కుమార్
9392006080

## వేసవి కాలం

వేసవి కాలం వస్తోంది
విలవిల లాడును జీవాలు
పశుపక్ష్యాదులకు నీరివ్వాలి
గ్రాసం గింజలు సమకూర్చాలి
మూగజీవులను ప్రేమించాలి
మనలో ఒకటిగా భావించాలి
జాతి వేరైనా ప్రాణం ఒకటే
చిన్నవని చిన్నచూపు వద్దు
మూగజీవుల ప్రాణం ముఖ్యం
చెట్టు గుట్ట పుట్ట మీదనో
ఏర్పాటు చేద్దాం నీటి తొట్లను
అడవి జంతువుల ఆవేదన
అర్థం చేసుకొని మెలగాలి
పశుపక్ష్యాదులు మన నేస్తాలు
కాపాడుకుందాం నేస్తాలను



–యాదవరం చంద్ర కాంత్ గౌడ్
9441762105

## విశ్వాసం లేని కుక్కలు!

యుద్ధాలు
ఛందోబద్ధ పద్యాల వంటివి
ఆదిమ కాలంలోనే
వాటి వైభవాలు!

మరణాలేవీ
భౌతికం కానప్పుడు
విజయమో వీరస్వర్గమో
అర్థం రహిత పద బంధాలే!

ఒకడి పాదాల మీద
మరొకడు నిలబడి
రణ నినాదం చేయడం
చార్లీ చాప్లిన్ తరహా కామెడీ సినిమా!

మార్కెట్ మీద
కాలు దువ్వే చౌక ధరల వ్యాపారీ
కూర్చున్న కొమ్మను నర్కునే
మూర్ఖుడూ నీవూ ఒకటే!

అన్ని దేశాల కుక్కలకు
విశ్వాసం ఉండాలన్న రూలేం లేదు
చైనా కుక్కలకు తిక్క ముదిరినప్పుడు
శాంతి కాముకులనూ కాటేస్తాయి!

మన కాళ్ళు మీద మనం
నిజంగా నిలబడటం మొదలు పెడితే
వాడైనా మరొకడైనా ఏదో ఒకనాటికి
కాళ్ళ బేరానికి రాక తప్పదు!!



– కోట్ల వెంకటేశ్వర రెడ్డి
9440233261

## నే నెళ్ళి పోతా

పల్లవి: నే నెళ్ళిపోతా నాపల్లెకు అన్నో
పట్నమోళ్ళ తిప్పలనూ నే చూడలేను
చరణం: పొద్దున్నే నేనులేచి సూర్యుని
మొక్కుదమంటే పెద్ద మేడలే అడ్డమాయె
వెలుగన్నదే రాక మొద్దునిద్ర వదలలేక
ఒళ్ళు హుషారులేని చీకట్ల బతుకలేను.
నేనెళ్ళిపోతా....
చెట్టు కింద మంచమేసి ముచ్చట్లాడుదమంటె
తులసి మొక్క గూడ కరువాయె వదినో
టీవీకే కళ్ళాయె ఫోనులోనె మూతులాయె
మాట్లాడే దిక్కులేని అడవిల నేనుండలేను.
నేనెళ్ళిపోతా...
ఫ్యానుగాలి ఏసిలకు ఒంట్లో సత్తువ తగ్గె
ఎండన్నదే ఎరుగక ఒల్లంతా మెత్తబడే
మరుగుదొడ్డి చెత్తబుట్ట అంట్లసింకు
గడపదాట పనిలేక మనుషులే కానరారు.
నేనెళ్ళిపోతా....
చెరువమ్మా సోయగం రచ్చబండ ముచ్చట్లు
ఆవులు గేదెలు పక్షులు పచ్చని పంటలు
చిన్న పెద్ద ముసలి అంతా నావాళ్ళె
ఓదార్చే మనిషుంటే మనసుకు చింతేలేదు
సేదదీర్చు చెట్లకింద అలసటంత తీరిపాయె
పల్లె తల్లి దీవెనుంటె బతుకు సల్లంగుండులే.
నేనెళ్ళిపోతా...



–గంజి.కళావతి
9912589703

## కల్నల్ సంతోష్ బాబుకు నివాళి

(తే.గీ.: కరొన కనిపెట్టి లోకాన కంటకయ్యి
నరుల దృష్టిని మరలింప ఎరలువేసి
వాస్తవాధీన రేఖను వరుసబెట్టి
చెరిపివేయనుజూడగా చీనజూడ!

భరతదేశంబు పిలుపును బాధ్యతగను
అందుకొనియును ముందుకు అడుగులేయ
వీరతెలగాణ సింగంబు ధీరపుత్ర
బాబు సంతోషు పోరాటబాట జూపె!

మంచు కొండలమాటున పొంచిఉన్న
వంచకులతోడనెంతయో వైరమొంది
సూటిమరణంబుకెదురేగ సూర్యపేట
పట్టణంబంతకదిలొచ్చె ప్రణతులిడగ!

చిన్నవయసులో రోషంబుఉన్ననీవు
చూపినావయ్య ఎనలేనిశూరగుణము
దేశయువతకు నీవిచ్చు దేశభక్తి
తరము తరముల తరగని పరమశక్తి!

నీదు త్యాగము నిలుచును నిజముగాను
తప్పకుండగ డ్రాగను తలను వంచి
భరతదేశంబు పాడును చరమగీతి
అదియె మేమంత వెలిగించు అసలు జ్యోతి!



–పెసరు లింగారెడ్డి
9010292500

## మెరుపులు

నిప్పుల కొలిమిలో
ఊపిరి నిండా
కనకం ఆభరణంలో
మెడలో నిండా

కాళ్లు నలిగే
మట్టి పగిలే
చక్రం తిరిగే
ఆకారం మిగిలే

రెక్కలు ముక్కలు
చెక్కలు చీలే
అంపము కోతలు
అలంకారంలో వోలె

శరీర నాగలి
స్వేదము ఎండే
పొలం పండాలి
బ్రతుకు నిండే

దారపు పోగులు
రాట్నం ఉరికే
పిడికెడు మెతుకులు
జానడు బట్టకే

వెదురు బొంగులు
సన్నని చిలీలేను
చేతుల శ్రమలు
కర్రకుపోసేను సొగసులను

కఠిన రాళ్లు
చెక్కిన చేతులు
కంటికి బాధలు
సుందర దృశ్యాలు

శుభ్రమైన బట్టలు
వదిలించే మురికి
తలతల మెరుపులు
అవసరం మనిషికి

తలను నిమిరి
వెంట్రుకలు సరిచేసి
ముఖమే సొగసరి
మనిషికి రూపంచేసి

చర్మము తొలిచి
కాటిని కాసి
అన్నింటినీ పంచి
దూరపు నివాసి

రంపము కొడవలి
సుత్తి గొడ్డలితో
నాగలి ఉలి
మానవులకు గుర్తులతో

సమస్త వృత్తులు
సాంఘిక న్యాయాన్ని
సామాజిక ధర్మాలు
పెంచాలి సమానత్వాన్ని



–కొప్పుల ప్రసాద్
9885066235

## చందమామ!!

పసివయసు లో వేసవికాలపు పున్నమి రాత్రుల్లో
చీకట్లను చీల్చుతూ తెల్లగా నింగిలో మిలమిల మెరిసే

చిత్తరువును చూస్తూ ఆరుబయట పట్టెమంచంలో
హాయిగా ఒరిగి అదేమిటని అమ్మమ్మ ను అడిగితే

కాలాలు మారినా చరితలు చెరిగినాతాను మారని
మనందరి మామ చందమామ అని తెలుసుకొన్న
రోజులింకా గురుతే.

లక్షలసార్లు తనతో చూపులముచ్చట్లాడి
నాసంతోషాలను బాధలను పంచుకుంటూనే వుంట ఇప్పటికీ.

కనులు మూసి కలల ప్రపంచంలో తేలుతున్నప్పుడు
ఒక్కోసారి పీడకలల కుదుపుకు దిగ్గున లేచి కలత చెందినప్పుడు.

నాకు ఓదార్పు నిస్తూ తీపి చేదు కలల రూపమే
కనుల కొలను అంటూ

ధైర్యం చెబుతూ నా మానసమున కలువలు పూయిస్తూ.

తన వెన్నెల లోకంలో విహరింప జేయిస్తాడు ఆ చందమామ
అందుకే నా జీవనసంద్రంలోని సంతోషాల అలలను.

కలతల సుడిగుండాలను తనతో పంచుకుంటూనే వుంటా
ఎందుకంటె నేను పోయినా ఎప్పుడూ తాను నీలాలనింగిలో

వెండిజాబిల్లైవెలుగుతూనే వుంటాడు
నా జ్ఞాకాలను తన వెన్నెలపిండి లో కలుపుకొని



–వకుళ వాసు
9989198334

## మధురవాణి

చదువు లేనిదే జ్ఞానం లేదు
చదువుకుంటేనే జ్ఞానం అని నమ్మన్నా
సకల సంపదలకు నిలయం విద్యాలయమని
పెద్దలు చెప్పిన మాట నిజమన్నా

చెప్పటం కన్నా చేయటం మిన్న
చెప్పటంకన్నా చేసి చూపటం మేలన్నా
వందచెప్పటం కన్నా ఒకటి చేయుమని
పెద్దలు చెప్పిన మాట నిజమన్నా

నవ్వడం భోగం నవ్వకపోవడం రోగం
అతిగా నవ్వడం అసలుకే మోసమన్నా
నవ్వు నాలుగు విధాలుగా చేటని
పెద్దలు చెప్పిన మాట నిజమన్నా

ఆపదను వీడి సంపదను వాడి
ఆపదలో ఆదుకోవాలని తెల్సి ఉండ న్నా
ఆపదలో ఆదుకోవాలి సంపదలో పంచుకోవాలని
పెద్దలు చెప్పిన మాట నిజమన్నా

భార్యను విడిచి బార్డర్లో చేరి
భారత్ను కాపాడేది సైనికుడేనని పొగడన్నా
జైజవాన్ జై భారత్ పొగడండి అని
పెద్దలు చెప్పిన మాట నిజమన్నా

అతివలపై గురి అత్యాచారాల ఉరి
అతివలె అవనికి వెలుగని తలచన్న

మానవ ధర్మం మంట కలసినదని
పెద్దలు చెప్పిన మాట నిజమన్నా

జలం లేనిదే జగతి లేదు
జలం తోనే జగమని నమ్మన్నా
జీవకోటికి జీవనాధారం జలం అని
పెద్దలు చెప్పిన మాట నిజమన్నా

అదుపు లేకుంటే పొదుపు లేదు
పొదుపు చేయడం మనకు మేలన్నా
నేటి పొదుపు రేపటి మదుపని
పెద్దలు చెప్పిన మాట నిజమన్నా

నాన్నా నీమనసు ఎంతో వెన్న
నీవు లేకుంటే నాచదువు సున్న
నీవే నాకు మార్గదర్శకుడవు నాన్న
నీఆత్మకు జోహారు జోహారు నాన్న

మధురం మధురం మధురవాణి మధురం
మృదు మధుర మకరంద భాషణం
ముచ్చట గొలిపే ముత్యాల భూషణం
మాటలోనే మంచితనం రాతలోనే రమణీయం



–మేకల లింగమూర్తి
9573284788

## వృద్ధాప్యం

వృద్ధాప్యం అంటే..
బాధ్యతల బరువు తీర్చుకున్న
సంధ్యా సమయం
ఇంటి అరుగుపై కూర్చొనే
గౌరవ అధికారం
మంచిచెడుల తేడా చెబుతూ
తమ పిల్లలను, వారి పిల్లలను
అదుపు ఆజ్ఞలలో ఉంచే
ప్రవచన సారం
కానీ ఇప్పుడు..

చిన్న గదిలోనూ
గది మూలనో ఉంటూ
ఆప్యాయపు
పలకరింపుకు దూరమై
పట్టెడన్నం కోసం
బ్రతుకు బండిని
లాగుతున్న బేలతనం
కొందరికైతే వృద్ధాశ్రమాలే చిరునామా
విడిపోయిన బంధాలే వీలునామా

వృద్ధాప్యం..
ప్రతి ఒక్కరికీ తప్పని దశ
రాబోయే జీవితపు దిశ
కన్నవారికి తల్లి తండ్రి
అయ్యే భాగ్యము
ప్రేమతో పెంచిన వారికి
ప్రేమనందించే యోగము
తెలుసుకొని మెలగాలి
ఆదర్శమై వెలగాలి

–విశ్వైక
సికింద్రాబాద్

## మా వూరికే పోతున్నా

ఈ నగరంలో
ఇక ఉండలేను
ఇక్కడ అంతా మురికి
మనుషులు మురికి
మాటలు మురికి
వీధులు మురికి
చేతలు మురికి
ఈ మురికిలో
ఇక ఉండలేను
ఇక్కడ అంతా మోసం
వ్యవహారంలో మోసం
వ్యాపారంలో మోసం
ఆధ్యాత్మికంలో మోసం
అడుగడుగునామోసం
ఈ మోస ప్రపంచంలో
ఇక ఉండలేను
ఇక్కడ అంతా అవినీతి
పనుల్లో అవినీతి
పాలనలో అవినీతి
చీడల అవినీతి
పీడలా అవినీతి
ఈ అవినీతిని
ఇక చూడలేను
ఈ నగరంలో
ఇక ఉండలేను

మావూరిలో
వానలు లేక
పంటలు లేక
వలస వచ్చిన
ఎత్తైన రంగురంగుల
ఈ మేడలను చూసి
ఇంతతెల్లని బట్టల
ఈ మనుషులను చూసి
ఈ మెరుపులను చూసి
ఎంత గొప్ప పట్నం అనుకున్న
బతుకు తెరువు దొరుకుతుందని
ఆలుబిడ్డలతో వచ్చిన
రాళ్ళు మోసిన
మట్టి మోసిన
మురికి వాడలూడ్చిన
దొరికిన పనిచేసిన
నా చెమటనే దోచుకునే
నగరవాసులను చూసి
నా కడుపును కొట్టే
నాగరాన్ని చూసి
నవ్విన, ఏడ్చిన
ఇక ఇక్కడ ఉండొద్దనుకున్న
ఎకాయెకినా పెళ్ళాం పిల్లలతో
మావూరికి పోతున్నా
బతికుంటే బలుసాకైనా తింటా
భగవంతుడు చల్లగా చూస్తే
మళ్లీ మాపొలం పచ్చగా
మా బతుకులు పచ్చగా
వద్దు ఈ పట్నవాసం
వద్దు బాబూ! ఈ మోసం
మళ్ళీ
మావూరికే పోతున్నా
మా వూరికే పోతున్నా...



– డా॥ తిరునగరి
సెల్: 939246547

## ప్రాణాంతక చిరుప్రాణులు దోమలు

హిమయుగమైనా ఉష్ణయుగమైనా
అనూహ్యంగా మారిన వాతావరణంలో సైతం
ఎలాంటి రక్షణ వ్యవస్థలేని దోమలు
ఈనాటివరకు ప్రకృతిలోఒదిగిపోయి
వీరవిహారంచేసే చిరుప్రాణులు దోమలు
మనదేశంలో సుమారు నాలుగు వందల జాతులు
అందులో మూడు జాతులు ప్రాణాంతకం
ఏడిస్, ఎనాఫిలస్ క్యూలెక్స్ దోమలు
దోమ కాటుకు సూక్ష్మ వ్యాధికారక
పరాన్నజీవులు మనిషి రక్తంలో కలిసి
డెంగ్యూ, మలేరియా, పిత జ్వరాలు ప్రబలి
జనావాసాలను మరుభూమిగా మారుస్తున్నాయి
ఆడదోమ జీవితకాలం కొన్ని వారాలైతే
మగదోమ జీవితం మూన్నాళ్ళ ముచ్చటే
ఆగమగ దోమలు మొక్కల రసం పీల్చినా
మనిషి రక్తం పీల్చేది ఆడదోమ మాత్రమే
గుడ్లు పెట్టాలంటే రక్తం పీల్చడం తప్పనిసరి
గుడ్లు పెట్టేది నీరు నిలకడగా ఉన్న చోట
కొద్ది రోజుల్లో గుడ్ల నుండి డింబకాలు
నీటిలో స్వేచ్ఛగా తిరుగుతూ అయిదు రోజుల్లో
నిద్రాణ ప్యూపా దశకు రూపాంతరం
రెండు మూడు రోజుల్లో ఎగిరే దోమలు
పది రోజుల్లో ముగుస్తుంది దోమ జీవిత చక్రం
మనుషుల ప్రయాణాలు వలసలు
కిక్కిరిసిన పట్టణీకరణ కార్యకలాపాలు
రోగాల వ్యాప్తికి దోహదం చేస్తాయి
హరిత గృహ వాయువుల మోతాదు పెరిగి
మూడు దశాబ్దాలలో ఉష్ణోగ్రతలు పెరిగి
మన దేశంలో
డెంగ్యూ వ్యాధి తీవ్రత పెరుగుతుందని
వాతావరణ అధ్యయనంలో తేలిన సత్యం
దోమల నిర్మూలనపై వాదోపవాదనలు వద్దు
అందరి ధ్యేయం కావాలి పరిసరాల పరిశుభ్రత.



– ఆచార్య పసుల వెంకట రెడ్డి
సెల్: 7013559809

## నా కథలో కథానాయకుడు

కణరూప 'జీన్' కరుణించిన దైవం
నా జన్మకు తనేగా మూల కారణం
శిశువుకు తన ఎద మైదానమిచ్చి
నా జీవన చలనచిత్ర వెండి తెర తానై
నా గొంతులో తనే మాటలు నూరి పోసి
చేతి వేలుతో పసి పాదాలకు కవాతు నేర్పి
నా కలంలో అక్షరసిరా కుమ్మరించి
ఎదుగదలకు దృఢ నిచ్చెన తానై
ఎగిరే పతంగానికి గాలి వాటం తానై
నా మల్లెల లతకు పటిష్ట పందిరై
నా ఆశల పుష్పానికి సుగంధాలద్ది
నా శశి వెలుగులకు తనో ప్రభాకరుడై
నన్ను నాకు పరిచయం చేసిన ఘనుడు!
నీడనిచ్చేందుకు నల్లని మబ్బు తానై..
ఏకంగా సూర్యున్నే అడ్డగించే ధీరుడు
పీల్చే గాలిలో తానే ప్రాణవాయువై..
జారినపుడు చేయూతనిచ్చే హస్తం
నా తడబాటులో ఊతకర్ర తానై
అమ్మకు నాకు మధ్య వారధియై
నేను విద్యుత్తైతే తనే వాహకమై
బతుకురైలుకు జెండా ఊపే గార్డు తానై
నా నవ్వులలో తన బాధలను మరిచి
నన్ను వీడని కొండంత భద్రత నీడ తానై
నా బతుక్కు తను పునాది రాయియై
జీవన భవనానికి మూలస్థంభంగా నిలిచి
బతుకు గోడల్లో కనిపించని ఇటుకేగా నాన్న!

తన దీవెనల రక్తాన్ని నాకు ఎక్కించి
తన చర్మ ముడతల్లో నా భవితను దర్శించి
తను శుష్కిస్తూనే నా సౌభాగ్యాన్ని కోరి
నా అణువణువులో తన చిరునామా నింపి
నా ఆకారంలో తన నమూనాను నిలిపి
నా ప్రయోజకత్వంలో సింహభాగం తానై
నా రైలుబండి చక్రాల కింద పట్టాలు తానై
అమ్మకు అమృతతుల్య ఆరాధ్యదేవుడై
సర్వశక్తులు అలవోకగా స్వచ్ఛందంగా ధారబోసి
మా కుటుంబానికి వెన్నెముకే కాదు
పచ్చటి కుటుంబవృక్షానికి తల్లివేరు తానై
నా ఆత్మకథలో తనే కథానాయకుడైన
నాన్నేగా ప్రాణం నా దేహానికి ఎపుడూ!



– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

## అమ్మమ్మ చెప్పిన కథ

అమ్మమ్మ చెప్పిన కథలను ఊహల సంచిలో దాచుకున్న బాల్యం...
పెరుగుతూ ....
పరుగిడే మనసునాపలేక పల్లె వెలుగు కోసం ఉరుకులాడింది!
పల్లెకు పట్నం గాలి తాకిందేమో....
ఇండ్లన్నీ ముసలి వాసన కొడుతుంటే...
చెట్లన్నీ ఆకులు రాలి శవాల కంచెలో ఉరి వేసుకున్న చిత్రం మసకగా కన్నీటి పొరల మధ్యగా గోచరిస్తున్నది!
పట్న వ్యామోహంలో బ్యాంకు లాకర్లలో బలవంతపు దాచివేతకు గురైన ఆత్మీయతలన్నీ కాష్ఠంలో శవాలుగా కాలిపోతుంటే ఊరి చివరి శ్మశాన వాటిక మీదుగా వీచే గాలులు కంపు కొడుతున్న ప్లాస్టిక్ హృదయం వాసనను మోసుకొస్తున్నాయి!
కడుపు దేవేసిన బాల్యం పట్నపు బడిలో తనకు తానుగా బందీ అయినా ఊహల సంచీని వెంటేసుకునే తిరుగుతుంది!
పెద్దయ్యాక సంచీని విప్పి అమ్మమ్మ కథలోని వర్ణనలన్నీ
నిజం చేసుకోవాలనే ఆశ చిగురించింది కాబోలు!



–వెగ్గలం ఉషశ్రీ
9440370066

## నానోలు

కర్పూరం
హారతి
దివ్వె
వెలుగు

అద్దం
ప్రతిబింబం
నీడ
నిజం

మొక్కు
ముడుపు
దర్శనం
వరం

వర్షం
గొడుగు
చలి
స్వెటర్

పత్రం
చూర్ణం
మూలిక
ఔషధం

చుట్టం
ఆదిత్యం
యాచకుడు
బిక్షం

పువ్వు
వికసించు
మనసు
క్షోభించు

రోడ్డు
మార్గం
ప్రయాణం
గమ్యం

కూర్మం
నీళ్లు
మూషికం
కన్నం

తండ్రి
బాధ్యత
గురువు
మార్గదర్శి



–చాపలమహేందర్
9949864152

## గోలీల మర్రి

ప్రకృతిచ్చిన చలువ పందిరి
మా వేసవి కాశ్మీరం

నీటి పక్షులు నీటితావు జేరినట్టు
వాడ వాడ పిల్లలంత దాని కిందికే

పైన పక్షుల కిసరబొసర
కింద మా అల్లరల్లరి

కయ్యం బెట్టుకున్న
కలుసుకున్న దాని కిందనే

బడెగ్గొట్టి
ఊడల్ని ఊయ్యాల జేసి ఊగుతుంటే
అవ్వ ఒడిని తలపించేది

గుంపులు గుంపులగా...
గుంపు గుంపుకో ఆట
గోలీల లక్కు... పైసల లక్కు
పిల్లి గీతలు... కట్టిసురుడు
ఎక్కుడు కిరీలు... ఉప్పు దెచ్చుడు
ముక్కు గిల్లుడు... రొట్టెపెంక
కండ్లకు గంతలు... గద్దచ్చె కోడి పిల్ల
అన్ని ఆటల కన్న...
గోలీలాటదే పెద్దభాగం

పిల్లలందరికి తల్లి చెట్టు
పేరును సార్థకం చేసుకున్న వటవృక్షం

జేబు నిండ గోలీలు గల్లర గల్లర అంటుంటే
గెలుపు గర్వపు ఆనందం అలవి గానిది
పోగొట్టుకున్నప్పుడు
రేపు మనదనే ధైర్యంతో శాంతపడడం

రకరకాల పక్షులకు ఆవాసం
ఊర పశురాలకు కొట్టం
అదొక జీవవైవిధ్య జాతీయ పార్కు

తిరుపతి గుళ్ళో...
మేలుకొలుపు పవలింపు పాటలెక్క
ఆ పక్షి సంరక్షణ కేంద్రం
ఉదయ సంధ్యా రాగాలు వినిపించేది

రాలినాకు గాలికెగిరినట్టు
రాజకీయ పెనుగాలికి
ఇప్పుడదొక...
స్మృతి చిహ్నం



–దామరకుంట శంకరయ్య
9440876788

## నిజం

ఆవును నిజమే!
నిజంగా
"నిజం" ఎప్పుడూ మంచిది
కాదు.

చెడ్డది కాకపోయినా సరే
అంతే.
లోకమంతా దేనికిచ్చే గౌరవం
ఇంతే.

అందమైన అబద్ధం ముందు
నిజానిది
ఎప్పుడూ పేదరికమే.

అయినా
అది చిరంజీవే.

బతికున్న ఋజువుగా
బలమై
ఏదో ఒక రోజు
ఘనమై
వినిపిస్తుంది....కనిపిస్తుంది



–చందలూరి నారాయణరావు
9704437247

## కొంచెం చెప్పుకోవాలని వుంది ...

ఒకసారి అలా నిలబడు
పిలవని చుట్టంలా వచ్చి
తిష్టవేసి మరణ మృదంగం వాయిస్తుంటే
భయంతో కలుగులో ఎలకలా దాగున్నప్పుడు
రాని ఏడుపు యిప్పుడు వస్తోంది
నా మాతృమూర్తి పై వున్న మమకారంను
మంట కలిపింది నీ భయమే
యిప్పుడు నేను బ్రతికి వున్న శవాన్ని
అందరు నువ్వు వచ్చి మాకు
ఏదో ఓ పద్ధతిలో పెట్టేవని
తెగ పొగుడు తున్నారు
కానీ నువ్వు నాకు తీరని ద్రోహం చేసావు
వికృత గ్రహాల కలయిక సమయాన
ఆవిర్భవించిన నీకు
వికృత ఆలోచనల వికార చేష్టలే
నీ పుణ్యమా అని
పదిమందికి అన్నం పెట్టిన చెయ్యి
తినిపించే చేతులకోసం ఎదురు చూసింది
లాలపోసి లాలిపడి నిద్రపుచ్చిన తల్లి
ఏబిడ్డ అయినా వచ్చి కాసిన్ని నీళ్ళు పోసి
నిద్రపుచ్చక పోతుందా అని
యెంత తపించి పోయిందో
రా రమ్మని పిలచిన
కమ్మని పిలుపుకు దూరం అయ్యాను
అమృతం చిందే చివరి చూపులకు
నోచుకోలేదు తుది పిలుపు వినలేదు
కష్టాల కాష్టాలు కాలుస్తున్నా
బరువైన భాద్యతలు మోయలేకపోయిన
ఏనాడూ కుంగలేదు నా తల్లి
కష్ట నష్టాల కావడి మోస్తూ
చక్కని విద్యాబుద్దులు చెప్పించి
ప్రయోజకులను చేసిన అమ్మకు
ఎమిచేయలేక పోయాను
భయంగా వుంది రామ్మా అంటే వేల్లలేకపోయాతను
మాయదారి చావు
ముంచుకొస్తోందని హెచ్చరించి
పిలిచి అలసి సొలసి వ్రాలిన
అమ్మ ఋణం ఎలా తిర్చుకోను
జీవితాలు లేని ఎందరకో ఆలంబనగా నిలిచి
జీవించడం నేర్పిన దేవతను చివరిగా
తాక లేక పోయాను
యిప్పుడు ఏడ్చి ఎమిలాభం
జరిగిన నష్టం నువ్వు తిర్చ గలవా
ఆశగా చూసే చూపులు ,
ఆసరాకోసం పిలిచే కేకలు మరిలేవు
పిచ్చి తల్లి వస్తానని యెంత తపించిందో
కన్న పేగులను కడసారి చూసుకోవాలని
కాస్త పక్కన వుంటే నిబ్బరం అనుకోని
పదే పదే కన్నీటితో వేడుకున్న విన్నపాలు
యింకా రింగు మని చెవులలో మ్రోగుతున్నాయి
జీవితం అంతా తప్పుచేసాను అని
కుమిలి పోయేలా చేస్తున్నాయి
అంతిమ యాత్రను సెల్‌లో చూస్తూ
చివరి తర్పణమంత్రాలను సెల్‌లో వింటూ
యిచ్చిన దురదృష్ట జాతకురాలినమ్మా
యీ కష్టం ఎవరకూ వద్దు బాబోయి
పాపిష్టి కరోనాకు తొందరగా పాడేకట్టి
సంబరంగా పాతాళంలో పాతేసే రోజుకోసం
ప్రపంచం అంతా పడి చస్తోంది
అన్ని వున్నాయి అందరూ వున్నారు
నువ్వు మాత్రం యిక లేవన్న మాటే
చాల కష్టం గా వుందమ్మా
అనుక్షణం గుండెని పిండేస్తోందే
ఒక్కసారి కలలో అయినా కనపడి కనికరించమ్మా

– సి.హెచ్.వి. లక్ష్మీ
సెల్: 9493435649

## నా అక్షరాలు...

నిరాదరణకు గురియవుతున్న
తెలుగుభాషకురక్షించే
అమృత ధారలు నా అక్షరాలు
కుట్రలు కుతంత్రాలు పన్నే
శత్రువుల తలలు తెగనరికేడి
సైనికుల చంద్రహాసాలు నా అక్షరాలు
మత అహంకార మత్తో చెలరేగేటి
మతోన్మాదులను మట్టుపెట్టే
బాకులు నా అక్షరాలు
మాతృభూమికి కీడు చేయ తలపెట్టిన
ముష్కరుల తలలు తెగ నరికే
కరవాలాలు నా అక్షరాలు
అవినీతిని అంతమొందించే
అవినీతి నిరోధకాలు నా అక్షరాలు
ఆడబిడ్డల మానాలను
మంటగలిపే కామ పిశాచాలను
శిక్షించే ఫిరంగులు నా అక్షరాలు
మంచుకొండల్లో పహారా కాసే
సైనికుల మనోధైర్యాలు నా అక్షరాలు
భరతమాత కీర్తిని చాటే బిడ్డలకు
సెల్యూట్ కొట్టే హస్తాలు నా అక్షరాలు



–జాధవ్ పుండలిక్ రావు పాటిల్
9441333315

## తలవంచు.

కరోనా గొంతులో
ప్రపంచం విలవిల.

మనిషి వికృతి కి
ప్రకృతి వల వల.
మనిషి ఇప్పుడు
తనపాకుడురాయి తనంతో
తలాతోకలేక తనలోకి తానే

కుంచించుకుపోయే ఆక్టోపస్.

సబ్బు నురగల్లో
బుడగలు చెప్పు జీవనభాష్యం.

నింగి, నేల జయించిన గర్వం
సూక్ష్మ జీవితో పరాభవం.

మూలలను వెతుక్కుంటూ
అడవి నగరపు దారిలో.

స్వార్థ,అహంకార
ముసుగు తొలగించు
ప్రకృతి ముందు తలవంచు.!

–కమలేకర్ శ్యామ్ ప్రసాద్ రావు.
9398507940.

పుస్తక సమీక్ష

## కాలానుగుణంగా సాగిన నవలికలు






ఆశయం అనేది తేలికైన పదం కాదు. మానవాళి మోయలేనంత భారం. ఒకప్పుడు ఒక అనాధను పోషించడం, అనాధ శరణాలయాలను నడిపించడం, వృద్ధాశ్రమాలను నడిపించడం, ఒకరికి మంచి చేయడం, ఒకరికి సాయం చేయడం లాంటివే కాకుండా మాటమీద నిలబడటం, జీవితం తాను అనుకున్నట్లే తీర్చిదిద్దుకోవడం లాంటివి కూడా ఆశయాలే. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో కూడా వీటిని సాధించడం ఎంత కష్టతరం. అందుకే వీటి భారాన్ని భరించడం కోసం ప్రభుత్వ సహాయాలు తప్పనిసరి అవుతున్నాయి. కానీ ఎవరికి సంబంధించిన వ్యక్తులను వారు తమ ఇంట్లోనే ఉంచుకుంటే ఈ బాధ్యత మరొకరి ఆశయం కాదు. మరో ఆశయం ద్వారా మరొక మంచి పని ఏదయినా ముందుకు నడిచేది. తాను కంటున్న బిడ్డ పొరపాటు కావచ్చు, తల్లి చనిపోవచ్చు. ఆడపిల్లని కావచ్చు ఇలా ఎక్కడపడితే అక్కడ పడేయకపోతే ఇలా మరొకరి బిడ్డను పెంచడం ఆశయం కాస్త మారచ్చు. నిజంగా అవసరమైన వ్యక్తులకే చెందవచ్చు. అలాగే మాట మీద నిలబడాలనే తత్త్వం, తన జీవితం తాను అనుకున్నట్లే తీర్చిదిద్దుకోవడంలో ఎంతో కష్టనష్టాలు ఎదురవుతాయి. అయినా వాటన్నింటినీ అధిగమించి సాధించడం మనిషిని మరింత ఉన్నతికి చేర్చుతుంది. కాలం అనేది ఎంతో గొప్ప మందు. ఆ మందుతో ఎన్నో సమసిపోతాయి. యుద్ధాలు సైతం కొంత కాలం అయ్యేసరికి చిన్నవిగా కనిపిస్తాయి. జన్మ కక్షలు సైతం సరదాగా మారిపోతాయి. అలాంటి కాలం ఇచ్చిన తీర్పు అంటే పూర్తిగా పరిశీలించాల్సిందే.

తురగా జయశ్యామల రచించిన రెండు నవలికలు ఎంతో ఆదర్శవంతంగా నడిచాయి. ఏ ఒక్క పాత్రనూ కించపరచకుండా నడిపిన తీరు ఎంతో చక్కగా ఉంది. ఇంటిముందు ఎవరో వదిలేసి వెళ్ళిన బిడ్డను విశ్వం (బ్రహ్మచారి) అందుకోవడం పెంచి పెద్ద చేయడం ద్వారా ఎంతో మహనీయతను చాటారు. ఒంటరిగా ఉన్న తన జీవితంలో వచ్చిన ఆ బాబు ఒక వెలుగులా, తనకు దేవుడిచ్చిన తోడులా భావించడం ద్వారా గొప్ప సందేశం సమాజానికి అందించారు. అటువంటి వ్యక్తిని గురువుగా భావించిన శిష్యుడు వాసు. గురువుకు తగినట్లే తనకంటూ ఒక ఆశయాన్ని ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం ద్వారా నిరూపించాడు. తాను ప్రేమించిన యువతిని ఇతర అడ్డంకులు ఎదురైనా వాటిని త్రోసిపుచ్చి ఆ యువతినే వివాహమాడాడు. ఆ రకంగా గురువుకు తగిన శిష్యుడుగా నిలిచిపోయాడు. ఆదర్శాలు వల్లించడం వరకే జీవితం అనుకునేవారే ఈ లోకంలో అనేకమంది ఉన్నారు. కానీ ఆదర్శాలనేవి ఆచరించడానికి అని తెలియజేసిన నవల "కాలమిచ్చిన తీర్పు"

ఇక రెండవ నవల "పెళ్ళిపందిరి" .. ప్రేమ, నమ్మకం, అనే పదాలు ఎప్పుడో కాలగర్భంలో కలిసిపోయాయి. ఇంకా ప్రేమ మిగిలి వుంది అంటే కేవలం అమ్మనాన్న దగ్గరే.. అక్కడే ఆగిపోయింది. దాటి బయటకు రావడానికి కూడా ప్రేమ ఇష్టపడటం లేదు. దాటితే తనలోని స్వచ్ఛత అడుగంటిపోతుందనే భయం ఉంది మరి. ఇక పెళ్ళి. ఒక వ్యాపార ఘట్టం. ఇరువురిలో ఎంత సంపాదన, ఎంత మిగులు, ఫ్యూచర్‌లో ఖర్చులు పోయాక మిగిలేదెంత? అందులో నీ ఆనందం ఎంత? నా ఆనందం ఎంత? ఇక్కడ ఒకటి మనం గమనించాల్సి ఉంది. ఈ కాలంలో పెళ్ళి అయినా సరే వారిరువురి మాటల్లోనూ మనం అనే మాట వినిపించదు. నీది నాది. మీ వాళ్ళు, మావాళ్ళు అనే ధోరణి కొనసాగుతూ ఉంది. సరే.. ఇవన్నీ అటుంచితే ఈ నవలిక ఒక ప్రేమ కథ. మామూలుగా శరీరాకర్షణ కు ప్రేమ అనే పేరు తగిలించుకుని భరత్, పూజను ప్రేమిస్తాడు. తను చూపే ప్రేమ, మాటలు నిజమని నమ్మి, పూజ కూడా ప్రేమిస్తుంది. ప్రేమ తర్వాత మనకు వినిపించే మాట నమ్మకం. ఆ నమ్మకంతో తొందరపడుతుంది. ఆ తొందరపాటుకే చక్కని పేరు అమాయకత్వం. ఒక పురుషుడికి లొంగిపోయేంతదాకా వచ్చాక ఇక అమాయకత్వం అనే పదం ఎక్కడుందో నాకు అర్థం కాని విషయం. అయితే అమాయకత్వంగా లొంగినా. గడుసుగా లొంగినా ఫలితం స్త్రీయే అనుభవించాలి కదా.. ఆ తర్వాత పూజ సామాజికంగా, మానసికంగా ఎలా కృంగిపోయిందో.. ఎవరిని నమ్మాలో, ఎవరిని నమ్మకూడదో అర్థం కాని తనంతో సాగిన నవలిక ఇది. ఆ తర్వాత వినోద్ అనే ఒక పాత్ర ప్రవేశించి తన గాధను అర్థం చేసుకోవడంతో కథ సుఖాంతం అవుతుంది.

ప్రేమించగానే ఎక్కడికి పిలిస్తే అక్కడకు వెళ్ళిపోకుండా ఉంటే పూజ జీవితం ఇంతదాకా రాకపోయేదేమో కదా అనుకునే దాకా కూడా కథ వెళ్ళకపోవడం కొంచెం ఆలోచనలో పడేస్తుంది,..

రచయిత్రి తురగా జరశ్యామల నవలికలు రెండూ సామాజిక స్పృహతో సాగినవి. ఏదయినా అర్థం చేసుకుంటే అందమైన జీవితం ఉంటుంది. అర్థం చేసుకోకుంటే జీవితం నిరర్థకం అనే విషయాన్ని చాటిచెప్పిన ఈ నవలికలు ఎంతో ఉపయుక్తమైనవి. రచయిత్రికి అభినందనలు..

ప్రతులకు: తురగా జయశ్యామల
ఫోన్: 098208 40285

–శైలజామిత్ర
9290900879

## సఫల స్నేహం

స్నేహం బంధుత్వం లేని బంధం
అన్నింటికీ అతీతమైన చెలిమి
కలిమి నందు చల్లని ఓదార్పు

అపార్థాలు రాని దగ్గరతనం
ఒంటరితనం దరిచేరని తోడు
సేద తీర్చే చల్లని చెట్టు నీడ

కాలం మారినా కట్టుబడేది
వయసు మీరిన దృఢ పడేది
అధరువులపై దరహాసంగా
శాశ్వతంగా నిలిచేది స్నేహం

భూభ్రమణం చీకటి వెలుగులను
ఒకటి వెంట ఒకటి చూపితే
ఎప్పుడూ వెన్నెలగా మిగిలి
విరజిమ్ముతుంది కాంతులను

పెనవేసుకుని బంధం సాగుతూ
పెన్నిధి గా నిలుస్తుంది పది కాలాలు
పది సెకనులు చాలు విడి పోవడానికి
నిజమైన స్నేహం వీడి పోదు యెప్పుడు
అదే సఫల సుమధుర స్నేహ గీతం!



–లక్ష్మి మదన్
9959186838

## ఇంకెంత కాలం నిరీక్షించాలో

నేను
ఆనందాల ఒడి, చదువులగుడికి
బడిపంతులును
ముసిరిన చీకట్లను తొలగించే
ఉషోదయ కాంతుల ప్రభాత వేళ
నిరాకార అక్షర దేవతను ఆరాధించడానికి
పాఠ్య పుస్తకం వేద పారాయణ గ్రంథంగా భావిస్తూ
నల్లబల్ల అనే ప్రమిదపై, తెల్లని సుద్ద కొవ్వొత్తితో
అక్షర దీపం వెలిగించడానికి
నా విద్యార్థుల ముసిముసి నవ్వులను తలచుకుంటూ
బడికి బయలు దేరతాను.
సూర్యుని వెలుగుకు వికసించిన పద్మాల్లా
విప్పారిన విద్యార్థుల ముఖాలు నా కంటికి చంద్ర బింబాలై
నా మనోసముద్రం ఉవ్వెత్తున ఎగసి పడినప్పుడు
ఆనంద సాగర కెరటాలు అనంతాకాశాన్ని అంటుకున్నప్పుడు
నేను పొందిన అనుభూతిని మళ్లీ ఎప్పుడు అస్వాదిస్తానో
వినీలాకాశంలో విహరించే విహంగాల్లా
నిర్మల కాసారంలో వికసించే కలువల్లా
పచ్చని తోటలో ఎగిరే సీతాకోక చిలుకల్లా
నీరెండలో నిండు నవ్వుతో ఆడుకునే పిల్లల్ని
ఆత్మ తృప్తినిచ్చే ఆ రసాను భూతిని అనుభవించడానికి
నేనింకెంత కాలం నిరీక్షించాలో.



–జి.గౌరీ ప్రసాద్
9494778099

పుస్తక సమీక్ష

## మరో కళాత్మక రూపకములు-త్రివిక్రములు






1949 సం॥లో సిరిపిల్లలో జన్మించిన డా॥ వడ్డేపల్లి కృష్ణగారు సహస్రాధిక లలిత గీత/ ద్విశతాధిక సినీగీత రచయితగా, ప్రామాణిక పరిశోధకునిగానే కాక అనేక టివి ధారావాహికలకు, కొన్ని సినిమాలకు రచనతో పాటు ప్రతిభావంతంగా దర్శకత్వం వహించడమే కాకుండా ప్రముఖులు డా॥ సినారె గారి స్ఫూర్తితో దాదాపుగా అన్ని సాహిత్య ప్రక్రియలను పండించారని అందరికీ విదితమే. ఇప్పటివరకు 30 కావ్యాలు, 60 ఆడియో ఆల్బమ్స్‌ను వెలువరించారు. 10 నాటికలు, నాటకాలు, 52 సంగీత, నృత్య రూపకాల్ని, 90 టీవీ ధారావాహికల్ని రచించడమే కాకుండా కొన్నింటికి దర్శకత్వం కూడా వహించారు. 19 డాక్యుమెంటరీలను రూపొందించారు. వీటి ద్వారా అనేక పురస్కారాలను, ప్రముఖుల చేతుల మీదుగా అవార్డులను అందుకుని తెలుగు సాహిత్య రంగంలో తమదైన శైలిలో రచనలు చేసి, తమకంటూ ఒక స్థానాన్ని సాధించారు. ఇలా అనేక రచనలు ఎంతో విజయవంతంగా రచించిన వీరు ఇటీవల 60 ఏళ్ళ తెలంగాణ సంఘర్షణ– సాధనను 60 నిమిషాల నిడివి గల జయజయ జయహే తెలంగాణ' అనే సంగీత నృత్య రూపకం ను రచించి, అన్ని జిల్లాలలో ప్రదర్శింపజేయడం విశేషం.

డా॥ వడ్డేపల్లి కృష్ణ గారు ఇదివరలోనే "వడ్డేపల్లి రూపకాలు" వెలువరించారు. ఇపుడు తెలంగాణ రూపకాలు–త్రివిక్రములు అనే సంపుటిని వెలువరించారు. ఇందులో తెలంగాణ మహారాణి( రుద్రమదేవి), రామప్ప, గోలుకొండ, పుష్కర పుణ్యఫలం, పుష్పవిలాపం, తరతరాల తెలంగాణ, స్తంభాద్రి సంబరాలు, తెలంగాణ తేజో మూర్తులు, తెలంగాణ పుణ్యక్షేత్రాలు, తెలంగాణ వైభవం, యాదాద్రి వైభవం వంటివే కాకుండా వినియోగదార్ల విజయపథం, ప్రకృతి పరిరక్షణ, విత్తనాల విలువ అనే సామాజిక విషయాల పై కూడా సమర్థవంతంగా రూపకాలను తీర్చిదిద్దారు. బంగారు తెలంగాణ రూపకంలో అనేక విషయాలను తెలియజేసారు. 1971–2001 మధ్య సాగిన ప్రభుత్వ ఉద్యోగాల్లో విద్యారంగాల్లో నీటిపారుదల ప్రాజెక్టులలో తెలంగాణాకు జరిగిన అన్యాయాల్ని ఏకరువు పెట్టారు. పుష్పవిలాపం రూపకంలో అనేక పూలను ఎంతో హృద్యంగా వర్ణించడం గమనించవచ్చు.

అంతే కాకుండా బతుకమ్మ పండుగకు పనికి వచ్చే మందారాలు, గుమ్మడిని, తంగేడు పూలను వర్ణించడం మనసుకు ఎంతో ఆహ్లాద పరిచింది. ఇప్పటివరకు దాదాపు 55 సంగీత నృత్య రూపకాల రచనలు చేసిన వడ్డేపల్లి గారు సామాజిక అక్రమాలను ఖండిస్తూ, మహనీయులుగా నిలిచిన మహాత్మాపూలే, డా॥ అంబేద్కర్ , బాగ్యరెడ్డి వర్మ వంటి ముగ్గురు సంఘసంస్కర్తలపై రూపకాల్ని "త్రివిక్రములు" అనే నామధేయంతో కూడా ఎంతో చక్కని రూపకాలను రచించడం వడ్డేపల్లి గారి సృజనకు తార్కాణం. వీటితో పాటు "విత్తనమా వందనం/ విధిగా అభినందనం/ గుప్త హరిత భరిత చరిత/ విత్తనమా వందనం" అంటూ చెట్లను పెంపొందించే మానవాళిని చైతన్యబరచడం విశేషాంశం. వడ్డేపల్లి కృష్ణ గారికి హృదయపూర్వక నమస్సులు..

ప్రతులకు:వడ్డేపల్లి కృష్ణ,
లలితశ్రీ నిలయం ఫోన్: 9246541699

–శైలజామిత్ర
9290900879

